SPECIAL EDITION
www.specialeditiondaily.com
# స్పెషల్ ఎడిషన్
తెలుగు దినపత్రిక
PRGI NO. TGTEL/26/A 0688
ON TV TELUGU
రంగారెడ్డి సంపుటి: 01, సంచిక : 233, సంపాదకులు : యస్.బి.ఎన్ చారి గురువారం, సెప్టెంబర్ 24, 2026, పేజీలు : 8, వెల : రూ.6/-

## టుడే స్పెషల్

### మేల్కొనేదెప్పుడు?

పసిప్రాణాలు కాలిపోవాలా?
తల్లుల కన్నీళ్లు మిగలాలా?
కాపాడాల్సిన చోటే కాలిపోవాలా?
ఇదేనా సర్కారీ వైద్యం?
పడకలు లేక నేలపై పడుకోవాలా?
పేదలకే ఈ అవస్థలా?
పరికరాలు లేక వైద్యం సాగాలా?
ప్రాణాలతో ప్రయోగాలు చేయాలా?
పెచ్చులూడే గోడలు ఎందుకింకా?
ప్రమాదాలపై పర్యవేక్షణ ఏదింకా?
ఎలుకలు వార్డుల్లో తిరగాలా?
కుక్కలు దవాఖానల్లో సంచరించాలా?
విద్యుత్ భద్రత ఎందుకు కరువైంది?
అగ్నిమాపక రక్షణ ఎక్కడుంది?
నిర్వహణలో నిర్లక్ష్యం ఎందుకు?
బాధ్యత వహించేది ఎవరు మరి?
పేదల ప్రాణాలకు విలువ లేదా?
ప్రజల హక్కులకు విలువ లేదా?
బడ్జెట్ కేటాయింపులు సరిపోతున్నాయా?
వైద్య వ్యవస్థను పట్టించుకుంటున్నారా?
ప్రాణాలు పోయాకే మేల్కొనాలా?
విషాదాలు జరిగాకే స్పందించాలా?
ప్రశ్నలకు సమాధానాలు ఎప్పుడు?
ప్రజలకు భరోసా ఎప్పుడు?
దవాఖానాలు వెంటనే బాగుచేయాలి!
పసిప్రాణాలకు రక్షణ కల్పించాలి!
వసతులు, పరికరాలు సమకూర్చాలి!
భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి!
నిర్లక్ష్యానికి బాధ్యులను తేల్చాలి!
ప్రతి మరణంపై సమగ్ర విచారణ జరపాలి!
పేదల వైద్య హక్కును కాపాడాలి!
ప్రజల ప్రాణాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలి!

**- యస్.బి.ఎన్ చారి, సంపాదకులు**




### ఘనంగా గణనాథుని నిమజ్జన వేడుకలు

భక్తిశ్రద్ధలతో పూజలు.. 3
అంగరంగ వైభవంగా నిమజ్జనం

ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్‌పోర్టుల డిజైన్లపై సీఎం ఆగ్రహం

# ఇవేం డిజైన్లు?

- ఇవి ఏఏఐ డిజైన్లా? ఏఐ చేసిన డిజైన్లా?
- రెండు ఎయిర్‌పోర్టుల డిజైన్లు అద్భుతంగా ఉండాలి
- తెలంగాణ చరిత్ర ఉట్టిపడేలా ఆకృతులు ఉండాలని సీఎం ఆదేశం
- వరంగల్ ఎయిర్‌పోర్టుకు రాణి రుద్రమ పేరు!
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి కొమురం భీం..
- పేర్లను దాదాపు ఖరారు చేసిన రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్, సెప్టెంబరు 23, స్పెషల్ ఎడిషన్ : వరంగల్ జిల్లా మామునూరు, ఆదిలాబాద్ జిల్లాలోని విమానాశ్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం పేర్లను ఖరారు చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టుకు రాణి రుద్రమ, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు కొమురంభీం పేర్లను దాదాపు ఖరారు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. రెండు పేర్లు కొలిక్కిరావడంతో సంబంధిత ఫైలును క్యాబినెట్ ముందుకు తీసుకెళ్లేలా అధికారులు చర్యలు చేపట్టారు. క్యాబినెట్‌లో ఈ పేర్లకు ఆమోదం లభించగానే.. ఈ విషయాన్ని తెలుపుతూ అవే పేర్లను ఖరారు చేయాలని కోరుతూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా లేఖ రాయనుంది. అక్కడి నుంచి కూడా ఆమోదం రాగానే రెండు ఎయిర్‌పోర్టుల పేర్లతో గెజిట్ విడుదల చేయనున్నట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది. మంగళవారం వరంగల్, ఆదిలాబాద్, ఎయిర్‌పోర్టులపై నిర్వహించిన సమీక్షలోనే ఈ పేర్లు దాదాపు ఖరారయ్యాయని, ఈ పేర్లపైనా కొద్దిసేపు చర్చ జరిగిందని సమాచారం. ఏపీలో ఇటీవల ప్రారంభించిన బోగాపురం ఎయిర్‌పోర్టు అల్లూరి సీతారామరాజు పేరు, ఒర్వకల్లు ఎయిర్‌పోర్టుకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేర్లు పెట్టిన అంశం కూడా చర్చకు వచ్చింది. అదే తరహాలో తెలంగాణకు వచ్చే విదేశీయులకు, ఇతర దేశాల ప్రతినిధులకు కూడా తెలంగాణ చరిత్ర, ఆ పేర్లు కలిగిన వారు చేసిన కృషి, పోరాట పటిమ తెలియాలంటే వారి పేర్లే సరైనవన్న అభిప్రాయం వ్యక్తమైందని తెలిసింది. ఈ నేపథ్యంలోనే రాణి రుద్రమ, కొమురంభీం పేర్లు దాదాపు ఖరారయ్యాయని సమాచారం. అయితే మామునూరు ఎయిర్‌పోర్టు విషయంలో సమ్మక్క-సారలమ్మ పేరు కూడా పరిశీలనలో ఉందని దీనిపై కొద్ది రోజుల్లోనే స్పష్టతవచ్చే అవకాశం ఉందని కూడా అధికారికవర్గాలు పేర్కొంటున్నాయి.

**ఎయిర్‌పోర్టుల డిజైన్లపై సీఎం ఆగ్రహం**

ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్‌పోర్టులపై సమీక్ష సందర్భంగా చూపించిన రెండు డిజైన్లపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా "ఇవి ఏఏఐ (ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా) డిజైన్లా.! లేక ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)తో చేసిన డిజైన్లా.!!" అని సంబంధిత వ్యక్తులను సీఎం ప్రశ్నించినట్టు సమాచారం. రెండు ఎయిర్‌పోర్టుల డిజైన్లు అద్భుతంగా ఉండాలని, తెలంగాణ చరిత్ర ఉట్టిపడేలా ఆకృతులు ఉండాలని సూచించినట్టు తెలిసింది. అలాగే విమానాశ్రయాల నిర్మాణం కోసం మళ్లించే నీటి కుంటలు, చిన్న కాలువలను నేరుగా మళ్లించకుండా.. ఎయిర్‌పోర్టులకు దగ్గర్లో కుంటలు, చెరువులను ఏర్పాటుచేసి, అక్కడి నుంచి అందులోని నీటిని పంపించేలా ఏర్పాటుచేస్తే అందరికీ

మిగతా 2వ పేజీలో...



బీజేపీ తెలంగాణ ఇన్‌చార్జిగా

## సునీల్ బన్సల్

- సహ ఇన్‌చార్జులుగా అభయ్ పాటిల్, రేఖా శర్మకు బాధ్యతలు
- తమిళనాడు సహ ఇన్‌చార్జిగా డీకే అరుణ
- కర్ణాటక సహ ఇన్‌చార్జిగా కాసం వెంకటేశ్వర్లు

హైదరాబాద్, సెప్టెంబరు 23, స్పెషల్ ఎడిషన్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్ నియమితులయ్యారు. దాదాపు ఆరేళ్లుగా రాష్ట్ర పార్టీ సంస్థాగత ఇన్ చార్జిగా కొనసాగుతున్న బన్సల్‌ను పూర్తిస్థాయి ఇన్ చార్జిగా నియమిస్తూ బీజేపీ జాతీయ నాయకత్వం నిర్ణయం తీసుకుంది. ఇక తొలిసారిగా తెలంగాణ కు ఇద్దరు సహ ఇన్‌చార్జులను నియమించింది. ఇప్పటిదాకా రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న అభయ్ పాటిల్‌కు సహ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. మరో సహ ఇన్‌చార్జిగా రేఖా శర్మను నియమించింది.

మిగతా 2వ పేజీలో...

# నిమజ్జనానికి నిఘా

## ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు జరగాలి: డీజీపీ సి.వి. ఆనంద్



### హైదరాబాద్‌లో భారీ బందోబస్తు

- 30 వేల మంది పోలీసుల మోహరింపు
- అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లు
- మహిళల భద్రతకు షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక చర్యలు
- డీజేలు, బాణసంచాకు దూరంగా ఉండాలని ఉత్సవ కమిటీలకు సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (స్పెషల్ ఎడిషన్): గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. బుధవారం ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్న డీజీపీ ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గణనాథుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. నిమజ్జన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీలు, పోలీసులు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలతో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందని డీజీపీ సి.వి. ఆనంద్ గుర్తుచేశారు. సెంట్రల్ జోన్ డీసీపీగా పనిచేసినప్పటి నుంచి సుమారు 13 ఏళ్లుగా ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలను దగ్గరగా చూస్తున్నానని తెలిపారు. ఉత్సవ కమిటీకి చెందిన సుదర్శన్‌తో పాటు ప్రస్తుతం ఆయన కుమారులు సందీప్, రాజ్ కుమార్, కుమార్తె వీణ, మహేష్ యాదవ్,

మిగతా 2వ పేజీలో...



అల్పపీడనం ప్రభావంతో

## భారీ వర్షాలు

కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

- రెడ్ అలర్ట్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

2

# సర్‌పై నజర్

## పారదర్శకతతో ఓటర్ల జాబితా సవరణ

- అర్హులైన ఓటరుకు అన్యాయం జరగొద్దు
- నో మ్యాపింగ్, అనామలీస్‌పై ప్రత్యేక దృష్టి
- బీఎల్‌ఓల క్షేత్రస్థాయి పనితీరుపై పర్యవేక్షణ
- గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం



రంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 23 (స్పెషల్ ఎడిషన్): రంగారెడ్డి జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ఎస్ఐఆర్-2026 ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణలో చిన్నపాటి పొరపాట్లకు కూడా తావులేకుండా ప్రతి దశను బాధ్యతా యుతంగా పరిశీలించాలని సూచించారు.

మిగతా 2వ పేజీలో...



రిమ్స్‌లో చిన్నారుల మరణాలు

# ప్రభుత్వ హత్యలే..

- బాధితులను పరామర్శించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- దత్తత తీసుకున్న జిల్లాలో చిన్నారులు చనిపోతే ముఖ్యమంత్రికి వచ్చే తీరిక లేదా?
- ఫుట్‌బాల్ ఆడేందుకు, విదేశాల్లో తిరిగేందుకు మాత్రం సమయం ఉంటుందా?

అదిలాబాద్, సెప్టెంబర్ 23 (స్పెషల్ ఎడిషన్): ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఏసీ పేలుడు ఘటనలో ఐదుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. బాధితులను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత బుధవారం పరామర్శించారు. రిమ్స్ హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదం జరిగిన ఎస్ఎన్‌సీయూను ఆమె పరిశీలించారు.

మిగతా 2వ పేజీలో...

ఉద్యోగ సంఘాలతో

# చర్చలు సఫలం

రెండు డీఏలకు సర్కార్ ఓకే

**నాలుగు నెలల తర్వాత మరో డీఏ**

**ఈ నెలలోనే పీఆర్సీపై నిర్ణయం**

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (స్పెషల్ ఎడిషన్): తెలంగాణ ప్రభుత్వంతో ఉద్యోగ సంఘాలు జరిపిన చర్చలు ముగిశాయి. రెండు డీఏలు ఇచ్చేందుకు సర్కార్ అంగీకరించింది. అలాగే నాలుగు నెలల తర్వాత మరో డీఏ ఇచ్చేందుకు ఓకే చెప్పింది. అంతేకాకుండా, ఈ నెలలోనే పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చింది. పీఆర్సీ కమిషన్ గడువును పొడిగించకుండా నివేదిక అందేలా చూడాలని ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. గడువులోపే పీఆర్సీ ప్రకటించాలని కోరాయి. డీఏ, పీఆర్సీ విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై

మిగతా 2వ పేజీలో...

సాగర్ ఎడమ కాల్వకు మరోసారి నీటి విడుదల

- సాగు చేసిన పంటలను కాపాడుకుంటాం
- దేవాదుల పూర్తిచేసి తుంగతుర్తికి సాగు నీరిస్తాం: మంత్రి ఉత్తమ్



నేరేడుచర్ల, సెప్టెంబరు 23 (స్పెషల్ ఎడిషన్): సాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ఎడమకాల్వ నుంచి మరోసారి నీటిని విడుదల చేస్తామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. తన స్వగ్రామమైన సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంతోపాటు నేరేడుచర్లల్లో చేపట్టిన పలు అభివృద్ధి

మిగతా 2వ పేజీలో...

# విధుల్లో జాప్యం వద్దు

- ఆరోగ్య కేంద్రాల్లో సమయపాలన తప్పనిసరి
- 24x7 ఆసుపత్రుల్లో రోస్టర్ డ్యూటీలు పకడ్బందీగా అమలు చేయాలి




రంగారెడ్డి, సెప్టెంబర్ 23 (స్పెషల్ ఎడిషన్): రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనితీరు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై జిల్లా అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. స్వర్ణకుమారి సమీక్ష నిర్వహించారు. రంగారెడ్డి డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి డిప్యూటీ డీఎంహెచ్ఓలు, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు హాజరయ్యారు. జిల్లాలో వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలును పటిష్టం చేయాలని అధికారులు సూచించారు.

మిగతా 2వ పేజీలో...

# ఇవేం డిజైన్లు?

మొదటి పేజీ తరువాయి...

ఉపయోగకరంగా ఉంటుందని కూడా సీఎం సూచించారని సమాచారం. సమీక్షలో సీఎం చేసిన పలు సూచనల మేరకు డిజైన్లు, ఇతరత్రా అంశాల్లో పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి. అధికారులు మరోసారి డిజైన్లను సీఎంకు సమర్పించనున్నారు.

**ఎత్తిపోతలకు ఆటంకాల్లేకుండా విద్యుత్తు**

ప్రస్తుతం రాష్ట్ర అవసరాలకు తగినట్లుగా విద్యుత్తును కొనుగోలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎత్తిపోతల పథకాలకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయానికి అందిస్తున్న విద్యుతు సరఫరాలోనూ ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని నొక్కి చెప్పారు. బొగ్గు కొరత కారణంగా రాష్ట్రంలో విద్యుదుత్పత్తి ఆగడానికి వీల్లేదని, బయట నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని పవర్ ప్లాంట్లలో పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జెన్‌కోకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. బుధవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో విద్యుత్తు శాఖపై రేవంత్ సమీక్ష నిర్వహించారు. దసరాలోపు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని అన్ని యూనిట్లలో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్లాంట్‌కు అవసరమైన బొగ్గును ఒడిసాలోని మహానది కోల్‌ఫీల్డ్ నుంచి పొందడానికి వీలుగా, లింకేజీ కోసం కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ, కోల్ ఇండియాతో సంప్రదింపులు జరపాలని నిర్దేశించారు. యాదాద్రిలో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి జరగకపోవడానికి కారణాలపై ఆరా తీశారు. అయితే యాదాద్రిలోని యూనిట్లన్నీ కూడా జీ-9 రకం బొగ్గును మండించడానికి వీలుగా డిజైన్ చేసినవేనని, సింగరేణిలో జీ-9 రకం బొగ్గు లభించదని సీఎం అధికారులు నివేదించారు. రాష్ట్రంలో జీ-9 రకం బొగ్గు లభించకపోతే ఆ సాంకేతికతో యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం ఎలా చేపట్టారని సీఎం ప్రశ్నించారు. దీనికి అధికారులు వివరణ ఇస్తూ.. ప్లాంట్‌కు అనుమతి పొందే క్రమంలో విదేశాల నుంచి బొగ్గును దిగుమతి చేసుకుంటామని అనుమ తులు తెచ్చుకున్నట్లు చెప్పారు. యాదాద్రి పవర్‌ప్లాంట్ పర్యావరణ అనుమతులు సస్పెండయ్యాక సింగరేణి నుంచి బొగ్గు తెచ్చుకుంటామని కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖకు నివేదించడం జరిగిందని వారు చెప్పారు. సాధారణంగా థర్మల్ ప్లాంట్‌లన్నీ బొగ్గు గనుల పిట్‌హెడ్‌లో కట్టాలని కేంద్ర విద్యుత్తు సంస్థ (సీఈఏ) మార్గదర్శకాలు ఉన్నాయని, యాదాద్రికి 270 నుంచి 300 కి.మీ దూరంలో బొగ్గు బ్లాకులు ఉన్నాయని అధికారులు వివరించారు. సుదూర ప్రాంతం నుంచి బొగ్గును యాదాద్రికి తరలించడం వల్ల రానున్న 25 ఏళ్లలో రూ.40 వేల కోట్ల అదనపు భారం ప్రజలపై పడనుందని తెలిపారు. సింగరేణిలోని ఏ బ్లాకులో కూడా జీ-9 రకం బొగ్గు లేదని సింగరేణి అధికారులు వివరించారు

గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడం వల్లే జీ-9 రకం బొగ్గును సరఫరా చేయలేకపోతున్నామని చెప్పారు. సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని అధికారులు తెలిపారు. కాగా సాగు అవసరాల కోసం సోలార్ విద్యుదుత్పాదన జరుగుతున్న సమయంలోనే కరెంటు అందించాలని కేంద్ర ప్రభుత్వం డిస్కమ్‌లకు ఆదేశాలు ఇచ్చిందని సీఎంకు అధికారులు వివరించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సోలార్ అవర్‌లలోని వ్యవసాయానికి విద్యుత్తు అందించాలని కేంద్రం మార్గదర్శకాలు ఉన్నాయని నివేదించారు. కాగా రైతు డిస్కమ్ ఏర్పాటు ప్రక్రియపై కూడా అధికారులను ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఈఆర్‌సీ లైసెన్స్ ఇచ్చినందున ఎప్పట్లోగా రైతు డిస్కమ్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే లాంఛనాలన్నీ పూర్తి చేసి, రైతు డిస్కమ్ కార్యకలాపాలు ప్రారంభించాలని ఆదేశించారు.

# రిమ్స్‌లో చిన్నారుల మరణాలు ప్రభుత్వ హత్యలే..

మొదటి పేజీ తరువాయి...

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రిమ్స్‌లో చిన్నారుల మరణాలు ప్రభుత్వ హత్యలే అని విమర్శలు చేశారు. దత్తత తీసుకున్న జిల్లాలో చిన్నారులు చనిపోతే ముఖ్యమంత్రికి వచ్చే తీరిక లేదా? అని ప్రశ్నించారు. ఫుట్‌బాల్ ఆడేందుకు, విదేశాల్లో తిరిగేందుకు మాత్రం సమయం ఉంటుందా? అని ఎద్దేవా చేశారు. హెల్త్ మినిస్టర్ ఎక్స్‌కర్షన్‌కు వచ్చినట్లు వచ్చి బాధ్యత లేకుండా వ్యవహరించారని మండిపడ్డారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కవిత డిమాండ్ చేశారు. నెల రోజుల్లో హాస్పిటల్ పెండింగ్ బిల్లు చెల్లించాలని, ఆదివాసీ ప్రాంతాలకు రోడ్లు వేయాలన్నారు. లేదంటే ఏజెన్సీల్లోని ఆదివాసీలతో కలిసి ఆదిలాబాద్‌ను ఘెరావ్ చేస్తామన్నారు. "ఆదిలాబాద్ రిమ్స్‌లో హృదయవిదాకరమైన సంఘటన జరిగింది. రోజులు కూడా నిండకముందే ఐదుగురు పసివాళ్లకు నిండు నూరేళ్లు నిండాయి. ఇది ప్రమాదవశాత్తు జరిగిన సంఘటననో, ప్రకృతి ప్రకోపం కారణంగానో జరగలేదు. కేవలం ఈ కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం కారణంగా జరిగిన సంఘటనే. ఇదే మొదటి సంఘటన కాదు. ఈ హాస్పిటల్‌లో గతేడాది 204 మంది, అంతకుముందు ఏడాది 174 మంది చిన్నారులు చనిపోయారు. ఇలాంటి పరిస్థితి ఉన్నప్పుడు ఇక్కడ పరిస్థితులపై ప్రభుత్వం బేరీజు వేసుకోని చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల నుంచి హాస్పిటల్‌కు వచ్చేందుకు సరైన రోడ్లు లేవు. ఏ రోజు పేపర్ చూసిన గర్భిణీ మృతి, చిన్నారులు మృతి అనే వార్తలే ఉంటున్నాయి. ఈ పరిస్థితి గురించి వార్తలు రాసి, కథనాలు ప్రచురించి మీడియా వాళ్లే విసిగిపోయారు"- కవిత 150 మంది డాక్టర్లు ఉండాల్సిన ఆసుపత్రిలో సగం మంది కూడా లేరని కవిత ఆరోపించారు. నర్సులు సగం మందే ఉన్నారని, శానిటేషన్ సిబ్బంది 20 శాతం మాత్రమే ఉన్నారన్నారు. సిబ్బందితో నడ్డి విరిగేలా పనిచేయిస్తూ వాళ్లను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. 150 ఏసీలు ఉంటే ఒక్క మెకానిక్ లేదని, ముగ్గురు ఎలక్ట్రీషియన్స్ మాత్రమే ఉన్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద 500 కోట్ల రూపాయల బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఈ సంఘటనకు హాస్పిటల్ సిబ్బంది గానీ పేషెంట్లది గానీ తప్పు కాదన్నారు. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానని ముఖ్యమంత్రి చెప్పారని, దత్తత తీసుకున్న జిల్లా పరిస్థితి ఇలా ఉంటుందా? ఐదు మంది పిల్లలు చనిపోతే వచ్చి చూసేందుకు తీరక లేదా? అని ప్రశ్నించారు. 'మైనార్టీ, ఆదివాసీ పిల్లలు చనిపోతే చూసే టైమ్ కూడా ఈ ముఖ్యమంత్రికి లేదా? హెల్త్ మినిస్టర్ వచ్చి ఇక్కడ కనీసం గంటన్నర కూడా లేరు. ఆయన వచ్చి కలెక్టర్‌తో సమీక్ష నిర్వహించలేదు. ఎక్స్‌కర్షన్‌కు వచ్చినట్లు వచ్చివెళ్లారు. పేదలైన బాధిత కుటుంబాలకు కనీసం పైసా సాయం చేయలేదు. ప్రభుత్వం చేసిన తప్పులకు పరిహారం కాదు ఫైన్ కట్టాలి. ప్రతి కుటుంబానికి రూ. 50 లక్షలు ఇవ్వాలి. ప్రభుత్వం చేసిన తప్పునకు కచ్చితంగా మూల్యం చెల్లించుకోవాల్సిందే. జనం బాటలో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చినప్పుడే ఇక్కడి పరిస్థితులను ప్రభుత్వానికి చెప్పాం. అడవులతో పచ్చగా ఉండే ఆదిలాబాద్‌లో క్యానర్స్ పేషెంట్లు పెరుగుతున్నారని చెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆదిలాబాద్ జిల్లాలో హెల్త్ ప్రొఫైల్‌కు సంబంధించి కమిటీ వేస్తాం. ఆ కమిటీ ద్వారా అన్ని అంశాలపై స్టడీ చేసి నివేదిక ఇస్తాం. ఒక్క రిమ్స్‌లోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని హాస్పిటల్స్‌లో పరిస్థితులు బాగా లేవు. వరంగల్ ఎంజీఎంలో పై కప్పు కూలింది. నాగర్ కర్నూల్‌లో ఎలుకలు కొరికి ఈసీజీ మెషీన్ పనిచేయటం లేదు. కచ్చితంగా అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఫోరెన్సిక్ అడిట్ నిర్వహించాలి' అని కవిత అన్నారు. రాష్ట్ర బడ్జెట్లో హెల్త్ కోసం 10శాతం బడ్జెట్ కేటాయిస్తామన్న సీఎం 5 శాతం మాత్రమే కేటాయిస్తున్నారని కవిత ఆరోపించారు.

దాంట్లో సగం జీతాలకే పోతుందని, ఇక మౌలిక సదుపాయాలకు ఆ నిధులు ఏం సరిపోతాయ్? అని ప్రశ్నించారు.

ముఖ్యమంత్రికి నెల రోజులు సమయం ఇస్తున్నామని, ఈ లోగా పెండింగ్ బిల్లులు చెల్లించి... ఈ ప్రాంతంలో రోడ్లు వేయించాలన్నారు. అదే విధంగా ఈ జిల్లాకు ముఖ్యమంత్రి వచ్చి పరిస్థితిని తెలుసుకోవాలని, ఎస్టీల కోసం వస్తున్న ఫండ్స్‌కు లెక్క చెప్పాలన్నారు. ఆషామాషీగా వచ్చి చూసి పోయే పార్టీ కాదు మాది. ప్రశ్నిస్తాం, పోరాడుతాం, పరిష్కారం అయ్యే వరకు ఫైట్ చేస్తామన్నారు.

# బీజేపీ తెలంగాణ ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్

మొదటి పేజీ తరువాయి...

బుధవారం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పార్టీ ఇన్‌చార్జులను, సహ ఇన్‌చార్జులను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ నియమించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలకు ఈ నియామకాల్లో ప్రాధాన్యం దక్కింది. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి.. ఒడిసా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమితులు కాగా, తమిళనాడు, ఉత్తరాఖండ్ రాష్ట్రాల ఇన్‌చార్జిగా సీనియర్ నేత రాంమాధవ్ నియమితులయ్యారు. ఎంపీ డీకే అరుణ.. తమిళనాడుకు, కాసం వెంకటేశ్వర్లు.. కర్ణాటకకు రాష్ట్ర పార్టీ వ్యవహారాల సహ ఇన్‌చార్జులుగా నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జిగా మధ్యప్రదేశ్‌కు చెందిన అరవింద్ భదోరియాను నియమించారు. సహ ఇన్‌చార్జిగా తమిళనాడుకు చెందిన వానతీ శ్రీనివాసన్ నియమితులయ్యారు.

**తెలంగాణలో అధికారమే లక్ష్యంగా..**

తెలంగాణలో అధికార పీఠమే లక్ష్యంగా బీజేపీ జాతీయ నాయకత్వం వ్యూహాత్మక అడుగు వేసింది. యూపీ, బెంగాల్, ఒడిసా రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన నేతగా గుర్తింపు ఉన్న బన్సల్‌కు తెలంగాణ బాధ్యతలు అప్పగించింది. బెంగాల్‌కు ఇకపై కూడా ఆయన ఇన్‌చార్జిగా వ్యవరించనున్నా.. అక్కడ బీజేపీ అధికారంలో ఉన్న నేపథ్యంలో తెలంగాణపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. 'దాదాపు ఆరేళ్ల నుంచి రాష్ట్ర పార్టీ సంస్థాగత ఇన్‌చార్జిగా కొనసాగుతున్న బన్సల్‌కు తెలంగాణలో క్షేత్రస్థాయి పరిస్థితులతోపాటు సంస్థాగతంగా పార్టీ బలం, బలహీనతలపై సంపూర్ణ అవగాహన ఉంది.

వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావాలంటే అనుసరించాల్సిన కార్యాచరణలో ఆయన వ్యూహాలే కీలకం కాబోతున్నాయి' అని బీజేపీ ముఖ్యనేత ఒకరు వెల్లడించారు. మరోవైపు, ఇప్పటివరకు ఇన్‌చార్జిగా పనిచేసిన అభయ్‌పాటిల్‌ను సహ ఇన్‌చార్జిగా నియమించడం ఆయనను డిమోట్ చేసినట్లుగా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పార్టీ నాయకత్వం తనను సహ ఇన్‌చార్జిగా నియమించడం సంతోషంగా ఉందని అభయ్‌పాటిల్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కాగా, పార్టీ జాతీయ నాయకత్వం తమకు మంచి టీమ్‌ను ఇచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. ఇన్‌చార్జి, సహ ఇన్‌చార్జుల అనుభవం పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో ఉపయోగపడుతుందన్నారు.

**స్మృతి ఇరానీకి రెండు రాష్ట్రాల బాధ్యతలు..**

కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీకి ఛత్తీస్‌గఢ్, హరియాణ రాష్ట్రాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సతీష్ పూనియాకు జమ్ము కశ్మీర్, పంజాబ్, హరీశ్ ద్వివేదీకి బిహార్, కర్ణాటక రాష్ట్రాల పార్టీ బాధ్యతలను అధిష్ఠానం అప్పగించింది. అనిల్ ఆంటోనీని నాగాలాండ్‌కు ఇన్‌చార్జిగా, గోవాకు సహ ఇన్‌చార్జిగా నియమించారు. ఉత్తరప్రదేశ్‌కు వినోద్ తావ్డే, మహారాష్ట్రకు బైజయంత్ పాండా, గుజరాత్‌కు తరుణ్‌చుగ్, మధ్యప్రదేశ్‌కు బిప్లబ్‌కుమార్ దేవ్, ఢిల్లీకి వినయ్ సహస్రబుద్ధే ఇన్‌చార్జులుగా నియమితులయ్యారు. కొత్తగా ఇన్‌చార్జులుగా నియమితులైన నేతలకు నితిన్ నబీన్ 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీని బలోపేతం చేయడంతో పాటు వికసిత్ భారత్ సాకారంలో కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

# ఉద్యోగ సంఘాలతో చర్చలు సఫలం

మొదటి పేజీ తరువాయి...

ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు పాల్గొన్నారు.

**ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది: లచ్చిరెడ్డి**

సమావేశం అనంతరం సచివాలయం మీడియా పాయింట్ వద్ద తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ... సీఎస్ ఆధ్వర్యంలో జాయింట్ స్టాఫ్ కమిటీ మీటింగ్ జరిగిందని తెలిపారు. ఉద్యోగుల నుంచి వస్తున్న ప్రధాన డిమాండ్లతో ఈనెల 6న ఉద్యోగ సంకల్ప సభ నిర్వహించామని తెలిపారు. మొత్తం 68 డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం సానుకులంగా స్పందించిందని.. అన్ని సమస్యల పరిష్కారానికి మార్గం చూపించినట్లు తెలిపారు. తమ డిమాండ్ల విషయంలో చొరవ తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ సంజయ్ జాజుకు ధన్యవాదాలు తెలియజేశారు. మొదటి డీఏ 3.64, రెండో డీఏ 2.74 కు ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. కమిటీ నివేదిక రాగానే పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారని లచ్చిరెడ్డి పేర్కొన్నారు.

**రెండుగా చీలిన ఉద్యోగ సంఘాలు**

ప్రభుత్వంతో చర్చల అనంతరం ఉద్యోగ సంఘాలు చెరో దారిలో వెళ్లాయి. రెండు డీఏలు ఇస్తామన్న సర్కార్ హామీని రెవెన్యూ సంఘం స్వాగతించింది. ఉద్యోగులకు మంచి రోజులు వచ్చాయని భావిస్తోంది. అయితే, రెండు డీఏలకు మాత్రమే ప్రభుత్వం అంగీకరించడం పట్ల టీఎన్‌జీవో, టీజీవో సంఘాలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. పెండింగ్ బిల్లులపై సీఎం, డిప్యూటీ సీఎం హామీ ఇవ్వాలని కోరుతున్నాయి. నాంపల్లి టీఎన్‌జీవో భవన్‌లో టీఎన్‌జీవో, టీజీవో ఉద్యోగ సంఘాల నేతల అత్యవసర సమావేశమయ్యాయి.

# సర్‌పై నజర్

మొదటి పేజీ తరువాయి...

బుధవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ సి. నారాయణ రెడ్డితో కలిసి నాగోల్ వార్డు కార్యాలయం, కుర్మి కాలనీ, శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్‌లను సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఓటర్ల వివరాల పరిశీలన, పాత ఓటర్ల జాబితాలతో మ్యాపింగ్, డేటా నమోదు తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రత్యేకంగా నో మ్యాపింగ్, అనామలీస్ వంటి కేటగిరీలపై అధికారులు మరింత దృష్టి సారించాలని ముఖ్య ఎన్నికల అధికారి సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా ఓటర్ల జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదే సమయంలో అనర్హుల వివరాలు, డూప్లికేట్ ఎంట్రీలు, చిరునామా మార్పులు తదితర అంశాలను ఎన్నికల నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ప్రతి దరఖాస్తు, అభ్యంతరం, నోటీసు, ఫైల్ డిస్పోజల్‌కు సంబంధించిన వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వారి అభ్యంతరాలు, వివరణలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని తెలిపారు. ప్రతి బీఎల్ఓ, క్షేత్రస్థాయి సిబ్బంది తమ పరిధిలోని ఓటర్ల వివరాలను బాధ్యతాయుతంగా ధ్రువీకరించాలని ముఖ్య ఎన్నికల అధికారి పేర్కొన్నారు. డోర్-టు-డోర్ వెరిఫికేషన్, పత్రాల పరిశీలన, డేటా ఎంట్రీ, మ్యాపింగ్ వంటి ప్రతి ప్రక్రియలోనూ ఖచ్చితత్వానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల నమోదులో నిర్లక్ష్యానికి తావులేకుండా సమగ్రంగా పరిశీలన జరపాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక, క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రతి దశను సమర్థవంతంగా పూర్తి చేయాలని, నిర్దేశిత కాలపరిమితిలో ప్రక్రియను పూర్తి చేసేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఎల్‌బీ నగర్ ఈఆర్ఓ/జడ్‌సీ వికాస్ మహతో, సంబంధిత ఎన్నికల అధికారులు, బీఎల్ఓలు, క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ ఎడమ కాల్వకు మరోసారి నీటి విడుదల

మొదటి పేజీ తరువాయి...

పనులకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుతో కలిసి మంత్రి ఉత్తమ్ బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సాగునీరు కావాలని రైతులు అడుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులు సమీక్షించి సాగులో ఉన్న పైర్లను కాపాడేందుకు ఒక తడి కోసం మరోసారి నీటిని విడుదల చేస్తామని ప్రకటించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవనందున శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గాయన్నారు. కరువు పరిస్థితులను రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం సరికాదన్నారు.

ప్రస్తుతం జలాశయాల్లో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూనే, రాబోయే వానాకాలం వరకు సరైన వర్షాలు కురవకపోతే తాగునీటి అవసరాలకు సరిపడేలా నీటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలను కాపాడుకుంటామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జూరాలకు నీటి విడుదలపై కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు చెప్పారు.

కాగా, దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి తుంగతుర్తి నియోజకవర్గానికి సాగునీటిని అందిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# నిమజ్జనానికి నిఘా

మొదటి పేజీ తరువాయి...

ఇతర సభ్యులు నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా జరిగేందుకు పోలీసుశాఖకు ఎంతో సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గణేష్ ఉత్సవాలు పది రోజుల పాటు కొనసాగి ముగింపు దశకు చేరుకున్నాయని డీజీపీ తెలిపారు. ఇప్పటికే నగరంలోని పలు ప్రాంతాల్లో నిమజ్జనాలు ప్రారంభమయ్యాయని, రేపు, ఎల్లుండి భారీ సంఖ్యలో విగ్రహాల నిమజ్జనం జరిగే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ పోలీసు కమిషనర్లు, ఎస్పీలు క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో నిమజ్జన బందోబస్తు కోసం సుమారు 30 వేల మంది పోలీసులను మోహరించినట్లు తెలిపారు. నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్‌ఎంసీ, విద్యుత్, జలవనరులు, ట్రాఫిక్, ఇతర ప్రభుత్వ శాఖలతో పోలీసుశాఖ సమన్వయంతో పనిచేస్తోందని డీజీపీ వివరించారు. హుస్సేన్‌సాగర్‌తో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిమజ్జనాలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ట్యాంక్‌బండ్ పరిసరాల్లో అవసరమైన ప్రాంతాల్లో క్రేన్లను ఏర్పాటు చేసి భారీ విగ్రహాల నిమజ్జనానికి సౌకర్యాలు కల్పించినట్లు వెల్లడించారు. నిమజ్జన ఊరేగింపుల సందర్భంగా మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు డీజీపీ తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో చోరీలు, మహిళల పట్ల వేధింపులు, ఇతర అవాంఛనీయ ఘటనలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామని చెప్పారు. షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ బృందాలు నిఘా కొనసాగిస్తాయని, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాలు పరస్పర సమన్వయంతో విధులు నిర్వహిస్తాయని తెలిపారు. నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలు, బాణసంచా వినియోగానికి సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అమల్లో ఉన్నాయని డీజీపీ గుర్తుచేశారు. అధిక శబ్దాల కారణంగా ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున ఉత్సవ కమిటీలు స్వచ్ఛందంగా డీజేలు, బాణసంచాకు దూరంగా ఉండాలని సూచించారు. భక్తి, ఆనందంతో నిర్వహించే గణేష్ ఉత్సవాలు ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా బాధ్యతాయుతంగా జరగాలని అన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిమజ్జన మార్గాల్లో పోలీసుల సూచనలను గౌరవించాలని డీజీపీ కోరారు. ఉత్సవ కమిటీలు కూడా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించి, నిమజ్జన కార్యక్రమాలను క్రమశిక్షణతో పూర్తి చేయాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా, భక్తి భావం చెదరకుండా, ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనాలు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డీజీపీ సి.వి. ఆనంద్ పిలుపునిచ్చారు.

# విధుల్లో జాప్యం వద్దు

మొదటి పేజీ తరువాయి...


జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఉద్యోగులు విధులకు సమయానికి హాజరై సమయపాలన పాటించాలని సమావేశంలో స్పష్టం చేశారు. ముఖ్యంగా 24x7 సేవలు అందించే ఆసుపత్రుల్లో సిబ్బంది రోస్టర్ డ్యూటీలను తప్పనిసరిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందేలా సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు.

**క్షేత్రస్థాయి పర్యవేక్షణకు ప్రాధాన్యం**

ఆరోగ్య కార్యక్రమాల అమలుపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని అధికారులు సూచించారు. ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల పనితీరును నిరంతరం పరిశీలిస్తూ లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జూనియర్ వైద్యులకు విధులు, కార్యక్రమాల అమలుకు సంబంధించి ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసి వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన అన్ని కార్యక్రమాల్లో రంగారెడ్డి జిల్లాను రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిపేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే లేదా సహకరించని ఉద్యోగులపై నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

**డీబీటీ నిధులపై స్పష్టత**

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నుంచి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) కింద రూ.98 లక్షల నిధులు ఇప్పటికే విడుదల చేసినట్లు డీఎంహెచ్ఓ డా. స్వర్ణకుమారి తెలిపారు. మిగిలిన రూ.2 లక్షల నిధులను కూడా త్వరలో క్లియర్ చేస్తామని వెల్లడించారు. ఆరోగ్య శాఖ కార్యక్రమాల అమలులో నిధుల వినియోగం, సిబ్బంది పనితీరు, క్షేత్రస్థాయి పర్యవేక్షణపై నిరంతర సమీక్ష కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువయ్యేలా ప్రతి ఆరోగ్య కేంద్రం సమర్థవంతంగా పనిచేయాలని, సిబ్బంది తమ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించాలని అధికారులు సూచించారు.



# అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు

## కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

### రెడ్ అలర్ట్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలి - మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 23, స్పెషల్ ఎడిషన్: అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో 24 గంటలూ అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సహాయం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, చెరువులు, వరద ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు.

స్పెషల్ ఎడిషన్ తెలుగు దినపత్రిక

గురువారం, సెప్టెంబర్ 24, 2026

# అదనంగా దోపిడీ

## సిలిండర్ సరఫరాకు రూ. 40 వరకు వసూలు - ఇవ్వకుంటే పంపిణీలో జాప్యం



కరీంనగర్ : గృహాలకు సరఫరా చేసే 14 కిలోల గ్యాస్ సిలిండర్ నిబంధనల ప్రకారం 1,014 రూపాయలు చెల్లించాలి. ఇంటికి సరఫరా చేసిన డెలివరీ బాయ్ 1,050 రూపాయలు దర్జాగా వసూలు చేస్తాడు. అసలు ధరకన్నా 36 రూపాయలు అదనంగా తీసుకుంటాడు. ఇదేంటి అంటే.. అదంతేననే సమాధానమిస్తాడు. ఇలా కరీంనగర్ జిల్లాలో పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం ఒక్కో సిలిండర్‌పై 36 నుంచి 46 రూపాయల వరకు పై అంతస్తులను బట్టి నిర్బంధంగా అదనపు డబ్బులను తీసుకుంటున్నారు.

**అధికారుల పర్యవేక్షణలోపం....** పౌరసరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం ప్రజలకు శాపంగా మారుతోంది.రాయితీ సిలిండర్ల సరఫరాలో ఇష్టారాజ్యంగా వసూళ్ల పర్వం కొనసాగుతోంది.నిబంధనల్ని అతిక్రమిస్తున్నా..ఏ ఒక్కరిపైన నిఘా పెట్టడం లేదు. ఇదంతా మామూళ్ల వ్యవహారమనే విధంగా అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. బాహాటంగానే అదనపు వసూళ్లు కొనసాగుతున్నా..చర్యలు తీసుకునే విషయంలో యంత్రాంగం వెనుకడుగు వేస్తోంది.మొక్కుబడి తనిఖీలు చేపట్టడం..వస్తున్న ఫిర్యాదులకు సరిగ్గా స్పందించకపోవడంతో గ్యాస్ వినియోగదారులు ప్రతీ నెల అదనపు దోపిడీకి గురవుతున్నారు.

**నెలకు అరకోటికిపైగా..**జిల్లాలో నెలకు సగటున గ్యాస్ సిలిండర్లకు అసలు బిల్లుకన్నా అదనంగా వసూలు చేసే మొత్తం 54 లక్షలకుపైగా ఉంటోంది. జిల్లావ్యాప్తంగా గృహావసరాల గ్యాస్ కనెక్షన్లు 1,67,943 ఉన్నాయి. వీటితోపాటు దీపం కనెక్షనలు 38,157 వరకున్నాయి. ఉజ్వల కనెక్షనలు 24,236 ఉండగా సీఎస్ఆర్‌కింద మరో 16,634, ఇతర కేటగిరీల్లో 468 కనెక్షన్లున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇలా మొత్తంగా జిల్లాలో 2,47,438 కనెక్షన్లకుగానూ నెలలో ఎంతలేదన్నా 1,50,000 సిలిండర్లను సరఫరా చేస్తున్నారు. ఒక్కో సిలిండర్‌కు 36 అదనంగా వసూలు చేసినా ఈ మొత్తం 54 లక్షలు అవుతుంది. ఇలా ఏడాదికి వీటి ద్వారానే 6.48 కోట్లు ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 27 గ్యాస్ ఏజెన్సీలు ఉండగా అందరూ ఇదే పంథాలో దోపిడీని కొనసాగిస్తున్నారు.

**ఫిర్యాదులకు స్పందనేది..?** వాస్తవంగా ఏ గ్యాస్ ఏజెన్సీదారు అయినా వారు ఇళ్ల వద్దకు సరఫరా చేసే గ్యాస్‌కు సంబంధించి డెలివరీ బాయ్స్‌తో అదనంగా వసూళ్లు చేయకూడదు. జిల్లాలో ఇది నిత్యకృత్యంగా మారింది. ఎవరన్నా.. డీలర్లను నిలదీస్తే తమకు సంబంధం లేదనే దాటవేత మాటలే వినిపిస్తున్నాయి. ఒకవేళ పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఆధారాలను అడుగుతుండటం.. లేదా చర్యలు తీసుకుంటామని కాలక్షేపం చేయడమే కనిపిస్తుంది. గతంలో అసలు అదనంగా వసూలు చేయవద్దని పలుమార్లు అధికారులు డీలర్లకు ఆదేశాలు జారీ చేసినా ఎక్కడా వసూళ్లను ఆపలేదు. ఏ ఒక్క డీలర్‌పైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ అదనపు వసూళ్లతోనే డెలివరీ బాయ్స్ జీతభత్యాలను ఏజెన్సీ నిర్వాహకులు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఇంకొందరు వేతనాలు, వాహనాల భారాన్ని తగ్గించుకునేందుకు పంపిణీ చేసే బాయ్స్‌కు ఎలాంటి జీతాలు ఇవ్వకుండా సరఫరా బాధ్యతల్ని అప్పగిస్తున్నారు. పంపిణీ చేసిన సిలిండర్లపై అదనంగా వచ్చే డబ్బులను డెలివరీ బాయ్స్ తీసుకునే విధంగా ఒప్పందాల్ని కుదుర్చుకున్నారు. బహుళ అంతస్తుల్లో ఉన్న వారికి సిలిండర్‌ను చేరవేసే సమయంలో 10 రూపాయలు అదనంగా అడిగితే ఇవ్వొచ్చు. అందరికీ ఇలా నిర్బంధంగా ఇంత మొత్తాన్ని పక్కాగా చెల్లించాలనే రూల్ పెట్టడం సరికాదని వినియోగదారులు వాపోతున్నారు. ఇలాంటి అదనపు బాదుడులకు పాల్పడుతున్న వారిపై తగు చర్యల్ని తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీల సమస్యల పరిష్కారానికి కృషి

## - సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతా: రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 23 (స్పెషల్ ఎడిషన్): ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు (పీఈటీలు) ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు. సూర్యాపేట పట్టణంలోని వైట్ హౌస్‌లో బుధవారం ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తమ వృత్తిపరంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఉన్న సమస్యలు, ఉపాధ్యాయుల అవసరాలు, విద్యా రంగానికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించారు. పాఠశాలల్లో విద్యార్థులకు శారీరక విద్య, క్రీడల ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని వారు వివరించారు. అలాగే ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం



పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరారు. వారి సమస్యలను సావధానంగా విన్న సర్వోత్తమ్ రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు పాల్గొన్నారు.

# ఘనంగా గణనాథుని నిమజ్జన వేడుకలు

## భక్తిశ్రద్ధలతో పూజలు.. అంగరంగ వైభవంగా నిమజ్జనం



ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 23 (స్పెషల్ ఎడిషన్): కేతేపల్లి మండలం చెరుకుపల్లి గ్రామంలో ఆదర్శ యూత్ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగి, బుధవారం ఘనంగా ముగిశాయి. నవరాత్రుల పాటు ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలతో గణనాథునికి భక్తులు పూజలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గణేశ్ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు, యువత ఆధ్వర్యంలో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. గణనాథుని నిమజ్జన వేడుకల్లో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. యువత ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ, జై బోలో గణేష్ మహారాజ్ అంటూ నినాదాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం నిర్ణయించిన నిమజ్జన ప్రదేశానికి గణనాథుని విగ్రహాన్ని తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ యూత్ గణేష్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నవరాత్రుల పాటు గణనాథుని ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించామని, గ్రామ ప్రజల సహకారంతో నిమజ్జన వేడుకలను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు.

# పల్లెపల్లెకు ఆర్టీసీ బస్సు

## - చకచకా సాగుతున్న పెద్దపల్లి డిపో నిర్మాణ పనులు - వచ్చే నెల 14న ప్రారంభానికి ఏర్పాట్లు

పెద్దపల్లి : ఎన్నో ఏళ్లుగా పెద్దపల్లి జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న ఆర్టీసీ బస్‌డిపో కల ఎట్టకేలకు సాకారం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దపల్లి పర్యటన సందర్భంగా శంకుస్థాపనకు నోచుకున్న బస్‌డిపో నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. అక్టోబర్ 14న డిపోను ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైనట్లు అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. రాష్ట్రస్థాయి ప్రముఖులను కార్యక్రమానికి ఆహ్వానించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**పరుగులు పెడుతున్న పనులు**

డిపోకు సంబందించిన అన్ని పనులు చకాచకా జరుగుతున్నాయి. ప్రధాన ద్వారం వద్ద నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఒకవైపు సెక్యూరిటీ గది, మరోవైపు టైం ఆఫీస్ నిర్మాణాలు దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. మహిళా సిబ్బంది కోసం విశ్రాంతి గదుల నిర్మాణం కొనసాగుతోంది. సిబ్బంది అవసరాల కోసం మూత్రశాలల నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయి. డిపోలో అత్యంత కీలకమైన మెకానికల్ షెడ్ నిర్మాణం పూర్తయింది. షెడ్ కింద సీసీ పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. బస్సుల నిర్వహణ, మరమ్మతులకు షెడ్ కీలకం. డిపో ఆవరణ మొత్తాన్ని సీసీగా మార్చేందుకు మట్టి, కంకర పనులు వేగంగా చేపడుతున్నారు. ఈ పనులు పూర్తవడంతో ఆవరణలో ఉన్న పాత భవనాలలో పరిపాలనపరమైన కార్యాలయాలను నిర్వహించనున్నారు. రెండు భవన సముదా యాలు ఆర్టీసీ కార్యాలయాల నిర్వహణకు అందుబాటులో ఉండడంతో కేవలం డిపో ఆవరణ పనులు పూర్తికావలసి ఉంది. డిపోలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్ నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉంది. పనులను వేగంగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులు భావిస్తున్నారు.

**దశాబ్దాల కల సాకారం**

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు బస్‌డిపో ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేయాలన్న డిమాండ్ దశాబ్దాల తరబడి ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అనేక చిన్న చిన్న పట్టణాల్లో సైతం డిపోలు ఏర్పాటయ్యాయి. పెద్దపల్లిలో మాత్రం డిపో ఏర్పాటు కాలేదు. నాటి చంద్రబాబు ప్రభుత్వం హయాం నుంచి డిపో ఏర్పాటు ప్రతిపాదన ఉంది. కానీ కార్యరూపం దాల్చలేకపోయింది.

గత అసెంబ్లీ ఎన్నికలలో తన ఎన్నికల హామీలో విజయరమణారావుకు ఇదొక కీలక ఘట్టంగా మారింది. ప్రస్తుత ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను ఆనుకుని ఉన్న ప్రభుత్వ కార్యాలయాల దాదాపు 4 ఎకరాల 30 గుంటల స్థలం డిపో ఏర్పాటుకు అనువైనదిగా నిర్ధారించారు. ఈ కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరలించి ఆ స్థలాన్ని అందులోని భవనాలను సైతం ఆర్టీసీ కోసం అప్పగించారు. డిపో పనులకు డిసెంబర్ 2024లో సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ. 5.66 కోట్ల నిధులు కేటాయించారు. ప్రభుత్వ విప్ విజయమరణారావు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలించి వేగవంతం చేశారు.

**ప్రజల చిరకాల కోరిక**

పెద్దపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటి నుంచి ఆర్టీసీ డిపో కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం బస్‌డిపో నిర్మాణం తుది దశకు చేరుకోవడంతో వారి నిరీక్షణకు తెరపడనుంది. డిపో అందుబాటులోకి వస్తే పెద్దపల్లి నుంచి వివిధ గ్రామాలకు బస్సు సర్వీసుల నిర్వహణ మరింత సులభతరం కానుంది. కాల్వశ్రీరాంపూర్, ఓదెల, దర్మారం, ఏలిగేడు, జూలపల్లి వంటి మారుమూల గ్రామాలకు రాత్రి వరకు బస్సులు అందుబాటులో ఉంటాయి.

# స్మార్ట్‌ఫోన్లు, టీవీ స్క్రీన్‌తో కంటిచూపుపై ప్రభావం

ఆసిఫాబాద్: లోకజ్ఞానం కూడా తెలియని చిన్నారులు పలువురు వివిధ కారణాలతో చూపు మందగించి ఇబ్బందులు పడుతున్నారు.

పిన్న వయసులోనే కళ్లద్దాలు దరించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈనెల 15 నుంచి అర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమం) వైద్య బృందాలు జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతిచదువుతున్న విద్యార్థులకు కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా ఈ విషయం వెలుగు చరీ సంది. దృష్టిలోపాలకు గురైన వారికి అవసరమైన చికిత్స అందించడంతో పాటు అద్దాలు అవసరమైన వారిని గుర్తిస్తున్నారు.

గతేడాది.. జిల్లాలో గతేడాది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని రెండు నియోజక వర్గా ల్లోని 135 పాఠశాలల్లో మొత్తం 22,130 మంది విద్యార్థులకు దృష్టి పరీక్షలు నిర్వహించగా వారిలో 9726 మంది బాలురు, 12,404 మంది బాలికలు ఉన్నారు. వీరిలో మొత్తం 732 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించగా గత సంవత్సరం 427 మందికి కంటి అద్దాలు అందించగా ప్రస్తుత సంవత్సరం మిగతా 305 మందికి అద్దాల పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ఈనెల 15 నుంచి రెండో విడత పరీక్షలకు శ్రీకారం చుట్టారు. జిల్లాలోని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో 6 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే డాక్టర్ నరేందర్ పర్యవేక్షణలో కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో కంటిచూపు లోపం లేని జిల్లా దిశగా చర్యలు తీసుకోవడంలో బాగంగా పరీక్షలు నిర్వహి స్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. గత సంవత్సరం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉన్నత పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించి కంటిచూపు లోపం ఉన్నవారిని అధికారులు గుర్తించారు. వారిలో కొంతమందికి కంటి చుక్కలతో నయం కాగా, మరికొంత మందికి ఉచిత అద్దాలను అందజేశారు. కంటిచూపు లోపం తీవ్రత ఎక్కువగా ఉంటే అపరేషన్ దిశగా కూడా చర్యలు తీసుకో నున్నారు.

ఇవి కారణాలు..

పల్లె, పట్టణాలు తేడా లేకుండా దాదాపు ప్రతి ఇంట్లో కనీసం రెండు, మూడు స్మార్ట్ ఫోన్లు ఉంటున్నాయి. పిల్లలు మారం చేస్తున్నారనో ఇంటి పనులు చక్కదిద్దుకునేటప్పుడు ఇబ్బంది పెట్టకుండా ఉండాలనో పెద్దలే వారికి ఫోన్లు ఇచ్చి అలవాటు చేస్తున్నారు. ఇక 10 నుంచి 16 ఏళ్ల బాలబాలికలలో కొందరు వ్యక్తిగతంగా ఫోన్లు వాడుతుంటే కొందరు తల్లిదండ్రుల ఫోన్లు వాడుతున్నారు. శారీరక శ్రమ కలిగించే ఆటలకు పిల్లలు దూరంగా ఉండి ఇంట్లో టీవీలకు గంటల తరబడి అతుక్కుపోవడం కూడా కారణంగా మారుతోంది. పిల్లలు అదే పనిగా చిన్న తెరపై గుడ్లప్పగించి చూస్తుండటంతో వారి కంటి చుపుపై ప్రభావం పడుతోంది. ఇక కొందరు పిల్లల్లో పుట్టుకతోనే దృష్టి సమస్య ఉండటం వారు అదే పనిగా స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు, టీవీలు చూడడంతో సమస్య మరింతగా పెరిగి మెల్లకన్ను వచ్చే అవకాశాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

# ఆర్టీసీలో ఎన్నికల సందడి..

## రాష్ట్ర కార్మిక శాఖ గ్రీన్ సిగ్నల్ - పదేళ్ల అనంతరం ఎట్టకేలకు మోక్షం




మంచిర్యాల : పదేళ్ల తరువాత ఎట్టకేలకు ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు మా ర్గం సుగమం అయింది. ప్రభుత్వ నిర్ణయం మేరకు రాష్ట్ర కార్మికశాఖ ఈ నెల 18న ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. ఎ న్నికలను రహస్య బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించనున్నారు. ఈ క్ర మంలో పోటీలో పాల్గొనే కార్మిక సంఘాల నుంచి ఈ నెల 21న అంగీకార పత్రాలు సైతం స్వీకరించగా, మంగళవారం డిపో మేనే జర్లు ముసాయిదా ఓటర్ల జాబితాను డిప్యూటీ రిటర్నింగ్ అధికారులకు(డీసీఎల్) అందజేశారు. 24వ తేదీన వివిధ యూనియన్ల నుంచి అభ్యంతరాలు స్వీకరించనుండగా, 25న వాటిని పరిశీలిం చిన అనంతరం ఓటరు జాబితాను ఎన్నికల బరిలో నిలిచే యూ నియన్లకు డిప్యూటీ రిటర్నింగ్ అధికారులు జిల్లాల వారీగా అంద జేయనున్నారు. అలాగే 26వ తేదీన పోటీలో నిలిచే యూనియ న్లకు గుర్తులు కేటాయించనుండగా, తుది ఓటరు జాబితాను డీసీ ఎల్‌లు సంబంధిత రిటర్నింగ్ అ?ధికారులకు అందజేయనున్నారు. 29వ తేదీన డీసీఎల్‌ల నుంచి యూనియన్‌ల ప్రతినిధులు డమ్మీ బ్యాలెట్ పేపర్లను అందుకోనున్నారు. ఈ ప్రక్రియ అంతా ముగి సిన తరువాత అక్టోబర్ 9వ తేదీన ఉదయం 5 నుంచి సాయం త్రం 6 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 14,15 తేదీ ల్లో పోస్టల్ బ్యాలెట్ ఎలెక్షన్ నిర్వహించనుండగా, 17వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలను వెల్లడించనున్నారు. ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో డిపోల వారీగా ఎన్నికల కోలాహలం నెలకొంది. దశా బ్దాల కాలం తరువాత ఎన్నికలు జరుగుతుండగా, కార్మిక సం ఘాల ప్రతినిధులు వివిధ అనుబంధ రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టేందుకు పావులు కదుపుతున్నారు. ఆర్టీసీ ఎన్నికల్లో ప్ర ధానంగా ఎంప్లాయిస్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూ నియన్, ఎన్‌డబ్ల్యూఎస్, ఐఎన్టీయూసీ బరిలో దిగనున్నాయి. రా ష్ట్రంలో అ?ధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి అనుబందంగా ఉన్న ఐఎన్టీయూసీ కొత్తగా ఈ సారి ఎన్నికల బరిలో నిలవనుంది. దీంతో ఆ యూనియన్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోనుంది. గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయబావుటా ఎగుర వేసేందుకు ఆ యూనియన్ బాధ్యులు అత్యంత పట్టుదలతో ఉన్నారు. మరోవైపు జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజక వర్గాల ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, గడ్డం వివేకానంద, గడ్డం వినోద్‌లు కాంగ్రెస్‌కు చెందిన వారే కావడంతో ఆర్టీసీ ఎల క్షన్లు వారికి ప్రతిష్టాత్మకంగా మారాయి. తమ అనుబంధ యూని యన్ ఐఎన్టీయూసీ గెలుపే లక్ష్యంగా జిల్లాలోని ఎమ్మెల్యేలంతా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లనున్నారు. అలాగే బీజేపీకి అనుబంధంగా భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) కూడా ఎన్నికల బరిలో నిలిచేందుకు కసరత్తు ప్రారంభించింది.

దాదాపు పదేళ్లపాటు ఆర్టీసీలో గుర్తింపు ఎన్నికలు లేక యూ నియన్లు స్తబ్దంగా ఉన్నాయి. కార్మికులకు ఏ సమస్య వచ్చినా... వారి తరుపున పోరాడే అవకాశం ఆయా యూనియన్ల నాయకు లకు లేకుండా పోయింది. మరోవైపు కార్మిక సంఘాలు ప్రభుత్వా ల నుంచి తమ డిమాండ్లను సైతం నెరవేర్చుకోలేని పరిస్థితి నెల కొంది. ప్రస్తుతం గుర్తింపు ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ లభించడంతో తమ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అటు కార్మిక సంఘా లు, కార్మికులు పట్టుదలతో ఎన్నికల్లో పాల్గొననున్నారు. ఆర్టీసీలో చివరిసారిగా 2016లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగగా, ఏఐ టీయూసీ అనుబంధ సంఘంగా ఉన్న ఎంప్లాయిస్ యూనియ న్ గెలుపొందిది.

సంస్థ పరిరక్షణ, కార్మికుల సమస్యల పరి ష్కా రం కోసం 2019లో ఆర్టీసీలో 53 రోజులపాటు సుదీర్ఘంగా సమ్మె జరగడం, కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి ఉద్యమాన్ని తీవ్ర రూపం చేయడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అప్పటి ప్ర భుత్వం కార్మిక ప్రాతినిధ్య సంఘాల సభ్యత్వాన్ని రద్దు చేసింది. దీంతో కార్మిక సంఘాలు నామమాత్రంగా మిగిలిపోయాయి. యూ నియన్ల ప్రాతినిధ్యానికి బదులు ప్రభుత్వం ఆర్టీసీలో వెల్ఫేర్ కమి టీలను నియమించడం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ప్రకటించింది. ఇదిలా ఉండగా 2026 ఏప్రిల్‌లో మూ డు రోజులపాటు జరిగిన సమ్మె సందర్భంగా ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ఎన్నికల నిర్వ హణకు సానులంగా స్పందించడంతో ఎట్టకేలకు ఎలక్షన్ నిర్వహ ణకు కార్మికశాఖ ముందుకు వచ్చింది. ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో మొత్తం ఆరు డిపోలు ఉన్నాయి.

# ఆదాయ వనరు..ఆయిల్‌పామ్ సాగు

బెజ్జూరు : సంప్రదాయ పంటల సాగు రోజురోజుకు భారంగా మారుతోంది. పెట్టుబడులు పెరగడం, దిగుబడులు తగ్గుతుండటంతో ఏటా రైతులు సాగులో నష్టాలను చవిచూస్తున్నారు. దీంతో రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. దీర్ఘకాలంగా దిగుబడులు ఇచ్చే ఆయిల్‌పామ్ సాగు చేయాలని ప్రభుత్వమూ ప్రోత్సహిస్తోంది. దీనిపై రైతులకు ఉద్యాన శాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సిర్పూర్(టి) నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు ఔత్సాహికులైన రైతులు ముందుకు వస్తున్నారు. దీంతో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది.మొదటి మూడేళ్లలో.. ఆయిల్‌పామ్ తోటలో మొదటి మూడేళ్లలో అంతర పంటలు వేసుకునేందుకు అవకాశం ఉంది. వీటితో కొంత ఆదాయాన్ని పొందవచ్చు. యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటిస్తే 3వ ఏడాది నుంచి 30ఏళ్ల వరకు ఆయిల్‌పామ్ దిగుబడి లభిస్తుంది. సిర్పూర్ తాలుకా పరిదిలోని 7మండలాల్లో 1231ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశారు. దహెగాంలో 528ఎకరాలు, పెంచికలపేటలో 197ఎకరాలు, చింతలమానేపల్లిలో 54ఎకరా లు, కాగజ్‌నగర్‌లో 332ఎకరాలు, సిర్పూర్(టి)లో 64ఎకరాలు, బెజ్జూరులో 26ఎకరాలు, కౌటాలలో 30ఎకరాల్లో సాగు చేశారు. కాగా ఆయిల్‌పామ్ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రాయితీలు అందిస్తున్నాయి. మొక్కల పెంపకం, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను సన్న చిన్నకారు రైతుల్లో ఎస్సీ, ఎస్టీలకు 90శాతం, బీసీలకు 80శాతం, ఇతరులకు 70శాతం సబ్సిడీతో ఉద్యానవన శాఖ అందిస్తోంది. ఎకరానికి రూ.15వేల చొప్పున ప్రోత్సాహకంగా అందిస్తోంది. 365రోజులు నీటి లభ్యత గల రైతులను రాయితీతో ప్రోత్సహిస్తోంది. రైతులకు ఎకరాకు రూ.4200చొప్పున నాలుగేళ్ల పాటు ఇస్తోంది. ఆయిల్‌పామ్ ఒక మొక్క ధర రూ.193ఉండగా, రైతు కేవలం రూ.20చెల్లిస్తే సరిపోతుంది. మిగితా వాటా కూడా ప్రభుత్వమే నేరుగా రైతులకు అందజేస్తోంది.

స్పెషల్ ఎడిషన్
తెలుగు దినపత్రిక

గురువారం, సెప్టెంబర్ 24, 2026

# సంపాదకీయం

## ఇమేజ్ దిగజార్చుకుంటున్న రాహుల్

ఇండియా కూటమి పార్టీల నుంచే పూర్తిస్థాయిలో ప్రధానమంత్రి అభ్యర్థిగా ఆమోదం పొందలేక తంటాలు పడుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తన చేష్టల ద్వారా ఇమేజ్‌ను మరింత దిగజార్చుకుంటున్నారు. మధ్యప్రదేశ్‌లో ఛాత్రోంకి గూంజ్ పేరుతో నిర్వహించిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు తావిచ్చింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్లోని ఇండోర్‌లో నిర్వహించిన ఛాత్రోన్ కీ గూంజ్ యువజన సదస్సులో పాల్గొనడం రాజకీయంగా తీవ్ర దుమారానికి దారితీసింది. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీతో పాటు పాల్గొన్న స్టాండప్ కమెడియన్ పుల్కిత్ మాని , ప్రధాని నరేంద్ర మోదీ విదేశాంగ విధానాలు, ఆయన మాట్లాడే శైలిని అనుకరిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యంగ్య ప్రదర్శనలో ప్రధాని మోదీ దివంగత తల్లిని ఉద్దేశించి చేసిన కొన్ని వ్యాఖ్యల పట్ల రాహుల్ గాంధీ స్టేజ్‌పైనే బిగ్గరగా నవ్వుతూ కనిపించడం వివాదానికి అసలు కారణమైంది. ఈ ఘటనపై భారతీయ జనతా పార్టీ తీవ్రస్థాయిలో మండిపడింది. రాజకీయాల్లోకి తల్లులను లాగడం, వయోవృద్ధులైన మహిళలను కించపరిచేలా వ్యవహరించడం కాంగ్రెస్ పార్టీ దిగజారిన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని బీజేపీ నేతలు విమర్శించారు. కేంద్రమంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పందిస్తూ.. ప్రధాని మోదీ తల్లిపై పరోక్షంగా జోకులు పేలుస్తుంటే రాహుల్ గాంధీ బాధ్యతారహితంగా నవ్వడం ఆయన నైతిక దివాలాకోరుతనానికి అద్దం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు ప్రధాని మోదీ వృద్ధులను గౌరవిస్తూ సంప్రదాయాలను పాటిస్తుంటే, మరోవైపు రాహుల్ గాంధీ మాత్రం అటువంటి అగౌరవాన్ని ప్రోత్సహిస్తున్నారని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో కుటుంబ రాజకీయాలు, వ్యక్తిగత దూషణలు సాధారణమైపోతున్నాయనే విమర్శల మధ్య, ఈ ఉదంతం మరోసారి అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధాన్ని తారాస్థాయికి చేర్చింది. రాజకీయ విమర్శలు సిద్ధాంతపరంగా ఉండాలి కానీ, ఒక వ్యక్తి కుటుంబ సభ్యులను, ముఖ్యంగా దివంగత తల్లులను లక్ష్యంగా చేసుకుని అగౌరవపరచడం భారతీయ సంస్కృతికి విరుద్ధమని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ తరహా ధోరణి ప్రజాస్వామ్య విలువలను దిగజార్చేలా ఉందని, కాంగ్రెస్ పార్టీ నాయకత్వం క్షమాపణ చెప్పాలని సోషల్ మీడియాలో డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి ఓ స్టాండప్ కమెడియన్‌తో కలిసి దేశ ప్రధాని నరేంద్ర మోదీని, చనిపోయిన ఆయన మాతృమూర్తిని అలాగే వృద్ధులను కించపరిచేలా ఒక వివాదాస్పద స్కిట్‌ను ఆయన ప్రోత్సహించడం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. మిలియన్ల మంది ఈ వీడియోను వీక్షించారు. అది గొప్పగాకాంగ్రెస్ చెప్పుకుంటోంది. కానీ ఒక ప్రధానమంత్రి పదవిని ఆశిస్తున్న జాతీయ స్థాయి నాయకుడు ఈ స్థాయికి దిగజారి ప్రవర్తించడం మాత్రం ప్రజల మనసుల్లో ముద్రపడిపోతుంది. కాంగ్రెస్ శ్రేణులు దీన్ని ఏదో మాస్ అప్పీల్‌గా భావించి రాహుల్ గాంధీని తెగ పొగిడేస్తున్నారు. కానీ, రాజకీయం కోణంలో ఇది పూర్తిగా నిస్సిగ్గుగా సాగే దిగజారుడు ప్రవర్తనే అవుతుంది. ప్రత్యర్థి పార్టీ విధానాలను, పరిపాలనను సైద్ధాంతికంగా లేదా ప్రజా సమస్యల ఆధారంగా ఎండగట్టాల్సింది పోయి, వ్యక్తిగత దూషణలకు దిగడం రాజకీయ విలువలను పూర్తిగా దిగజార్చడమే. కేవలం చప్పట్లు, ఈలల కోసం దేశ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని, కుటుంబ నేపథ్యాన్ని కించపరిచేలా వ్యవహరించడం రాహుల్ రాజకీయ పరిణతిలేమికి అద్దం పడుతోంది. ఈ చౌకబారు ప్రచారం స్వల్పకాలికంగా సోషల్ మీడియాలో హడావుడి చేసినప్పటికీ, దీర్ఘకాలంలో కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా తీవ్ర నష్టాన్ని చేకూరుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రతిపక్షాలు చేసే ఇలాంటి వ్యక్తిగత విమర్శలను, దూషణలను భారతీయ జనతా పార్టీ రాజకీయంగా ఎంత సమర్థంగా తనకు అనుకూలంగా మలుచుకుంటుందో గతం అనేకసార్లు నిరూపించింది. తమ అగ్రనేతను, ఆయన కుటుంబాన్ని కించపరిచిన ప్రతి అంశాన్ని బీజేపీ నాయకులు అత్యంత చురుకుగా, వ్యూహాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లి భావోద్వేగాలను రగిలిస్తారు. సామాన్యులు, ముఖ్యంగా సంప్రదాయ విలువలకు కట్టుబడే ఓటర్లు ఇలాంటి అగౌరవకరమైన రాజకీయాలను అసహ్యించుకుంటారు. దీన్ని ఆయుధంగా మలచుకునేషావో, కమలనాథులు కాంగ్రెస్ పార్టీ నైతిక దిగజారుడుతనాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి రాజకీయంగా భారీ లబ్ధి పొందుతారనడంలో ఏమాత్రం సందేహం లేదు. దేశ ప్రధాని పదవికి పోటీ పడుతున్న రాహుల్ గాంధీ బాధ్యతారహితమైన వైఖరి వల్ల ఆయన ఖాతాలో మరోసారి భారీగా మైనస్ మార్కులు పడినట్లయింది. సమస్యలపై పోరాడటం మానేసి, ఇలాంటి వ్యక్తిగత దాడులు, దిగజారుడు స్కిట్‌లను ఆశ్రయించడం వల్ల ఆయన నాయకత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకం మరింత సడలిపోతోంది. బాధ్యతాయుతమైన పదవిలో ఉండాల్సిన వ్యక్తి పద్ధతి మార్చుకోకపోతే, భవిష్యత్తులోనూ కాంగ్రెస్ పార్టీకి ఇలాంటి చర్యలే పెను శాపంగా మారుతాయని ఎన్నో సార్లు నిరూపితమయింది. కానీ పాఠాలు మాత్రం నేర్చుకోవడం లేదు.

# కానిస్టేబుళ్లే పోలీసు వ్యవస్థకు వెన్నెముక

### క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వంతో విధులు నిర్వర్తించాలి: హోంమంత్రి అనిత

అమరావతి : పోలీసు విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వం అత్యంత కీలకమని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. తల్లిదండ్రుల త్యాగాలను ఎప్పటికీ గుర్తుంచుకుని ప్రజలకు సేవ చేయాలని నూతనంగా విధుల్లోకి అడుగుపెడుతున్న కానిస్టేబుళ్లకు సూచించారు. పోలీసు యూనిఫాం ప్రజల్లో భయాన్ని కాకుండా భరోసాను కల్పించేలా ఉండాలని అన్నారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ బీటీసీ పరేడ్ గ్రౌండ్స్‌లో 2025-26 బ్యాచ్‌కు చెందిన 149 మంది స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి అనిత శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో రాష్ట్రంలో కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియను ఎన్నో అడ్డంకులను అధిగమించి పూర్తి చేశామని తెలిపారు. శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్ల స్టైపెండ్‌ను రూ.4,500 నుంచి రూ.12,000కు పెంచుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 21 శిక్షణ కేంద్రాల్లో 5,800 మంది కానిస్టేబుళ్లకు శిక్షణ పూర్తయిందని తెలిపారు. వీరిలో 2,330 మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారని వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో సుమారు 1,000 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉండటం విశేషమన్నారు. ప్రజలకు పోలీసులంటే భరోసా కలగాలిపోలీసు వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నెముక అని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. విపత్తులు, బందోబస్తు, అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

మారుతున్న నేరాల తీరుకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతిక నైపుణ్యాలు కలిగిన కానిస్టేబుళ్లకు ప్రత్యేక శిక్షణ అందించామని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని, వారికి సత్వర న్యాయం అందించేలా పనిచేయాలని సూచించారు. పోలీసులంటే ప్రజల్లో భయం కాకుండా భరోసా కలిగేలా వ్యవహరించాలన్నారు. రాజ్యాంగానికి అనుగుణంగా విధులురాజ్యాంగానికి అనుగుణంగా రాగద్వేషాలకు అతీతంగా నీతి, నిజాయితీ, కర్తవ్య స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని హోంమంత్రి అనిత దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రూపొందించిన 2047 విజన్‌లో కానిస్టేబుళ్లు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పదవీ విరమణ వరకు క్రమశిక్షణతో, ప్రశాంతంగా ప్రజలకు సేవలందిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని నూతన కానిస్టేబుళ్లకు హోంమంత్రి అనిత సూచించారు.

# ఏపీ పట్టణాల్లో ఒకే సారి రూ. 11,359 కోట్ల పనులకు శ్రీకారం!

తిరుపతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పట్టణాలు, నగరాల రూపురేఖలను సమూలంగా మార్చివేసే బృహత్తర అభివృద్ధి కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. రాష్ట్రచరిత్రలోనే తొలిసారిగా మునిసిపాలిటీలపై ఎలాంటి ప్రత్యక్ష ఆర్థిక భారం పడకుండా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో ఏకంగా రూ. 11,359 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులను కుప్పం వేదికగా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ పట్టణాల్లో రూ. 7,469 కోట్ల పనులతో పాటు, జీవీఎంసీ పరిధిలో ప్రత్యేకంగా రూ. 3,890 కోట్ల వ్యయంతో మౌలిక వసతుల పనులు చేయనున్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల పరిధిలోని 106 నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్న 123 మున్సిపాలిటీల్లో ఈ అభివృద్ధి పనులు ఏకకాలంలో ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మున్సిపల్ శాఖ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కుప్పంలో సీఎం చంద్రబాబు చేపట్టిన ఈ ప్రారంభోత్సవంలో నేరుగా భాగస్వాములయ్యారు. పట్టణ ప్రణాళికను ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ పనుల ద్వారా ప్రాథమిక మౌలిక వసతులకు పెద్దపీట వేశారు. రవాణా వ్యవస్థను పటిష్టం చేసేందుకు రహదారుల నిర్మాణానికి అత్యధికంగా రూ. 4,656 కోట్లు కేటాయించారు. పట్టణ సుందరీకరణ, ఆహ్లాదం కోసం పార్కుల అభివృద్ధికి రూ. 509 కోట్లు, రహదారుల భద్రతకు సెంట్రల్ మీడియన్ల కోసం రూ. 88 కోట్లు, రాత్రివేళల్లో వెలుగులు నింపేందుకు స్ట్రీట్ లైటింగ్‌కు రూ. 247 కోట్లు వెచ్చించనున్నారు. ఓవరాల్‌గా ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 2,165 కిలోమీటర్ల మేర రోడ్ల విస్తరణ, 502 నూతన పార్కుల అభివృద్ధి, 210 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్లు, 391 కిలోమీటర్ల స్ట్రీట్ లైటింగ్ , 300 కిలోమీటర్ల డ్రైనేజీ, సీవరేజ్ పనులు రూపుదిద్దుకోనున్నాయి. పట్టణ స్థానిక సంస్థలు , తీవ్ర ఆర్థిక లోటుతో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో, వాటి నిధులపై ఆధారపడకుండా ప్రైవేట్ భాగస్వామ్యం, ప్రభుత్వ మద్దతుతో ఊంఓ మోడల్‌ను ప్రవేశపెట్టడం పట్ల సుపరిపాలనా వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ఆధునిక వసతులు, ఆహ్లాదకరమైన వాతావరణం, సురక్షితమైన ప్రయాణ మార్గాల కల్పనే ధ్యేయంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు ఏపీలోని నగరాలు, పట్టణాల రూపురేఖలు మారిపోనున్నాయి.

ఈ కార్యక్రమం పూర్తయితే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,165 కిలోమీటర్ల రోడ్లు, 502 పార్కులు, 210 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్లు, 391 కిలోమీటర్ల మేర స్ట్రీట్ లైటింగ్, 300 కిలోమీటర్ల సీవరేజ్ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి వస్తాయి. పట్టణ స్థానిక సంస్థలపై ఒకేసారి ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ పనులను హెచ్ఏఎం పద్ధతిలో అమలు చేస్తోంది. ఈ విధానంలో కాంట్రాక్టర్లు తమ సొంత నిధులతో పనులు పూర్తిచేయగా, ప్రభుత్వం వారికి వార్షిక వాయిదాల రూపంలో చెల్లింపులు చేస్తుంది.

# కేసీఆర్ భూముల వివాదం.. చంద్రబాబు జపం



హైదరాబాద్ : రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా కేసీఆర్ భూములపై సమగ్ర విచారణ చేపడుతామని స్పష్టమైన ప్రకటన చేసిన తర్వాత, తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ భూముల వివాదంలో పూర్తిగా ఇరుక్కుపోయిన గులాబీ పార్టీ, ఆ ఉచ్చు నుంచి బయటపడేందుకు సరికొత్త సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించాలని చూస్తున్నదన్న వాదన రాజకీయ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ముఖ్యంగా కేసీఆర్, కేటీఆర్ ఫామ్ హౌజ్ భూములు, వాటి కేటాయింపులపై పెద్దఎత్తున చర్చ జరుగుతుండటంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీఆర్ఎస్ నాయకులు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. అయితే, ప్రధానంగా కేసీఆర్ , కేటీఆర్ భూముల చుట్టూ వివాదం నడుస్తున్నప్పటికీ, బీఆర్ఎస్ మాత్రం పూర్తిగా చంద్రబాబు జపం వైపు మళ్లడం గమనార్హం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా నీళ్లు వదిలేస్తున్నారని, గురుదక్షిణ కింద తెలంగాణ హక్కులను తాకట్టు పెడుతున్నారని కేటీఆర్, హరీష్ రావు, జగదీశ్వర్ రెడ్డి వంటి సీనియర్ నేతలందరూ ఒకే గళంతో తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇటీవల భూముల అక్రమాలపై రేవంత్ రెడ్డి స్వయంగా ఈ ముగ్గురు నేతల పేర్లను ప్రస్తావిస్తూ తీవ్రమైన ఆరోపణలు చేసిన నేపథ్యంలోనే ఈ పరిణామం చోటుచేసు కుంది. రేవంత్ సంధించిన ప్రశ్నలకు నేరుగా, వాస్తవాలతో కూడిన సమాధానం చెప్పలేకనే బీఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగానే ఏపీ అంశాన్ని తెరపైకి తెచ్చి చంద్రబాబును టార్గెట్ చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి, గత కొంతకాలంగా బీఆర్ఎస్ అనుసరిస్తున్న రాజకీయ శైలి ఇదే రీతిలో సాగుతోంది. తమపై అవినీతి లేదా భూ ఆక్రమణల ఆరోపణలు వచ్చిన ప్రతిసారీ, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని బీఆర్ఎస్ ఎదురుదాడికి దిగుతోంది. కానీ తాజా పరిణామాలను పరిశీలిస్తే, రేవంత్ రెడ్డిపై డైవర్షన్ పాలిటిక్స్ అంటూ ఆరోపణలు చేస్తున్న గులాబీ పార్టీ నేతలే స్వయంగా ఆ వ్యూహాన్ని అమలు చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. పార్టీ అధినేత కుటుంబాన్ని, కీలక నేతలను చుట్టుముట్టిన భూముల వివాదాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే ఈ సెంటిమెంట్ రాజకీయాలు తెరపైకి తెచ్చారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

# లవర్‌తో ఓయోకు వెళ్లిన యువతి..

### - గాయాలతో తెల్లారేసరికల్లా మృతి

హైదరాబాద్ : మాదాపూర్ ఏరియాలోని ఓయో హోటల్‌కు వచ్చిన యువతి మృతిచెందడం తీవ్ర కలకలం రేపింది. విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు వచ్చిన యువతి ప్రియుడితో కలిసి హోటల్‌లో రూం తీసుకుంది. తెల్లవారేసరికల్లా అనుమానాస్పదరీతిలో చనిపోవడంతో అతడే హత్య చేసి ఉండొచ్చునని పోలీసులు భావిస్తున్నారు. యువతి మృతిపై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశాఖపట్నానికి చెందిన షారన్ నిఖిత టోప్నో (23) అనే యువతి తన లవర్ శ్రీనివాస రవితేజతో హైదరాబాద్‌కు వచ్చింది. సిద్ధిఖీ నగర్ రోడ్ నంబర్-5లోని ఒక ఓయో హోటల్‌కు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు వెళ్లారు. ఆ గదిలోనే యువతి అనుమానాస్పదరీతిలో మృతిచెందారు. మంగళవారం తెల్లవారుజామున కొండాపూర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రి నుంచి యువతి మృతిపై మాదాపూర్ పోలీసులకు సమాచారం వచ్చింది. యువతి నిఖితను ఆమె లవర్ శ్రీనివాస రవితేజ, హోటల్ సిబ్బంది కలిసి కొండాపూర్ లోని ఆస్పత్రికి తరలించారని పోలీసులకు తెలిపారు. ఆమెను పరీక్షించిన డాక్టర్లు అప్పటికే నిఖిత మృతిచెందినట్లు నిర్ధారించారు. యువతి హోటల్ రూంలో స్పృహ తప్పి పడిపోవడంతో ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అయితే నిఖిత శరీరంపై గాయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. యువతి ముఖం, తలపై గాయాలు ఉన్నట్లు గుర్తించడంతో ఆమె ప్రియుడిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. నిఖిత చనిపోయినట్లు తెలియగానే హాస్పిటల్ నుంచి శ్రీనివాస రవితేజ పరారయ్యాడని, అతడే ఈ దారుణానికి పాల్పడ్డాడని ప్రాథమికంగా భావిస్తున్నారు. అనంతరం మాదాపూర్ పోలీసులు సిద్ధిఖ్ నగర్ లోని హోటల్ గదికి వెళ్లి తనిఖీ చేశారు. గదిలోని గోడలు, బెడ్‌షీట్‌లపై రక్తపు మరకలు కనిపించడంతో క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుడు శ్రీనివాస రవితేజను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. సాధ్యమైనంత త్వరగా నిందితుడ్ని అరెస్ట్ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

# తుగ్గలిలో ఎమ్మార్పీఎస్,ఎంఎస్పీ నూతన కమిటీలు ఎన్నిక

తుగ్గలి : మండల కేంద్రమైన తుగ్గలిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నూతన కమిటీల ఎన్నికలను నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి దుమ్ము చిన్న వెంకటేశ్వర్లు మాదిగ, తుగ్గలి మండల ఇన్‌చార్జి భీమప్ప మాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ తుగ్గలి మండల అధ్యక్షుడిగా మామిళ్ళకుంట రంగస్వామి,అధికార ప్రతినిధిగా రాతన దేవరాజు,ప్రధాన కార్యదర్శిగా రాతన పకీరప్ప,ఉపాధ్యక్షులుగా తిమ్మప్ప లను ఎన్నుకున్నారు. అదేవిధంగా ఎంఎస్పీ తుగ్గలి మండల అధ్యక్షుడిగా చెన్నంపల్లి నారాయణ, అధికార ప్రతినిధిగా ఎన్.జగన్నాథ్, ఉపాధ్యక్షుడిగా పి.రంగస్వామి, కోశాధికారిగా కే.రంగస్వామి లను వారు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఎమ్మార్పీఎస్,ఎంఎస్పీ అనుబంధ సంఘాలను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నూతన కమిటీలు కృషి చేయాలని నాయకులు సూచించారు. సమాజంలోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం సంఘటితంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్,ఎంఎస్పీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాచర్లలో ఘోర రోడ్డు ప్రమాదం

### డివైడర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం - ఒకరు అక్కడికక్కడే మృతి
### మరో ఇద్దరికి తీవ్ర గాయాలు.. - ఒకరి పరిస్థితి అత్యంత విషమం
### మృతుడు 9వ వార్డుకు చెందిన శంకర్‌గా గుర్తింపు..

మాచర్ల: పట్టణంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. నియంత్రణ కోల్పోయిన ద్విచక్ర వాహనం డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుడిని మాచర్ల 9వ వార్డుకు చెందిన శంకర్‌గా గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలపాలైన వారిలో ఒకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాద తీవ్రతతో ఘటనాస్థలంలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలా నికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ద్విచక్ర వాహనం అదుపుతప్పడానికి కారణం ఏమిటి, ప్రమాద సమయంలో వాహనం వేగం ఎంత, తదితర అంశాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఒక్కసారిగా జరిగిన ఈ ప్రమాదంతో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులుచర్యలు చేపట్టారు. ప్రమాదానికి సంబంధిం చిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెలువడాల్సి ఉంది.

### కరువు నివారణ చర్యల్లో భాగంగా

# రైతులకు సబ్సిడీతో పశువుల దాణా పంపిణీ

తుగ్గలి: కరువు నివారణ చర్యల్లో భాగంగా రైతులకు సబ్సిడీతో పశువుల దాణా పంపిణీ చేస్తున్నట్లు పశువైద్యాధికారి బాలకృష్ణ తెలియజేశారు. సోమవారం రోజున ఆయన ఎర్రగుడి గ్రామం నందు పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా.బాలకృష్ణ మాట్లాడుతూ 50 కేజీల దాణా ప్యాకెట్ పూర్తి ధర 1,110 కాగా,50 శాతం సబ్సిడీ పోను రైతు 555 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ దాణాలో 20 శాతం మాంసకృత్తులు (ప్రోటీన్) ఉంటాయని,పాడి పశువులకు అందించడం ద్వారా పాల ఉత్పత్తి పెరగడానికి సహాయపడుతుందని తెలిపారు. ఈ సబ్సిడీ పశువుల దాణా అవసరమైన రైతులు తమకు సమీపంలోని రైతు సేవా కేంద్రంలోని పశువైద్య సిబ్బందిని సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్,పశు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో కారణంగా రైతు కుటుంబాలకు నెలకు పదివేలు ఇవ్వాలి

చిట్వేలి : ఎల్‌నినో ప్రభావంతో నైరుతి ఋతుపవనాల సమయంలో లోటు వర్షపాతం నమోదైనది అని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మలిశెట్టి రాహుల్ అన్నారు. చిట్వేలి మండలం వెంకటరాజు పల్లిలో ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో కారణంగా రైతులు పంట వేయలేక, వేసిన పంటలను నీటి కొరతతో కాపాడుకోలేక నష్టపోతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి అవగాహన ఉందని. వారు వీలైన పరిధిలో ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే అన్నారు. కానీ ఈ ఎల్‌నినో ప్రభావం ఈశాన్య రుతుపవనాల పైన ఉంటుంది కావున 2027లో నైరుతి రుతుపవనాలు వరకు ప్రతి రైతు కుటుంబానికి నెలకు పదివేల రూపాయలు ఇచ్చి రైతులను కరువు నుండి కాపాడాలని కోరారు. వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఏ విధంగా ఆర్థిక సహాయం అందిస్తున్నారో అదేవిధంగా ఈ కరువును ప్రకృతి విపత్తుగా తీసుకొని 2027 వరకు ప్రతి నెలకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం, ప్రతి రైతు కుటుంబానికి అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. గాలేరు - నగిరిని త్వరితగతిన పూర్తి చేసి కడప, రాజంపేట, కోడూరు, తిరుపతి ప్రాంతాల చెరువులకు నీటిని నింపడం ద్వారా ఇటువంటి కరువు సమయాలకు భూమిలో నీటిమట్టం పూర్తిగా తగ్గకుండా నీటి లభ్యత ఉంటుంది కావున గాలేరు- నగరి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని రైతు సంఘం నాయకుడు మలిశెట్టి రాహుల్ ప్రభుత్వాన్ని కోరారు.

# సింగరాజుపల్లిలో ఘనంగా 9వ జాతీయ పోషణ మహోత్సవాలు

కొత్తపల్లి : సింగరాజుపల్లి అంగన్వాడీ కేంద్రంలో 9వ జాతీయ పోషణ మహోత్సవాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు సమతుల్యమైన పోషకాహారం అందించడం ఎంతో అవసరమని తెలిపారు. పోషకాహారం లోపించడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలను తప్పనిసరిగా భాగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మునగాకు, కరివేపాకును ఆహారంలో విరివిగా ఉపయోగించడం ద్వారా రక్తహీనతను నివారించడంతో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చని వివరించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో వివిధ పోషకాహార పదార్థాలతో పోషకాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ హరిత, హెల్పర్ సుభాషిని, లబ్ధిదారులు చంద్రకాంత్, విజయుడు, వరప్రసాద్, శివారెడ్డి, లక్ష్మీదేవి, త్రివేణి, రత్నమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

### నగరి, పుత్తూరు నియోజకవర్గాల్లో

# మాజీ మంత్రి ఆర్కే రోజా విస్తృత పర్యటన

నగరి: రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, కానీ పార్టీని నమ్ముకుని నిరంతరం శ్రమించే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి ఆర్.కె. రోజా పేర్కొన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం సైనికులా పనిచేసిన కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందని ఆమె ఉద్ఘాటించారు.?ఇందులో భాగంగానే ఆమె నగరి మున్సిపాలిటీ మరియు పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి, ఇటీవల కాలంలో ఆకస్మికంగా మరణించిన వైయస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను నేరుగా వారి నివాసాలకే వెళ్లి పరామర్శించారు. నగరి మున్సిపాలిటీ కాకవేడులో పరామర్శ.... నగరి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు కాకవేడులో వైయస్ఆర్సీపీ ముస్లిం మైనారిటీ నాయకులు కాజా బాయ్ చిన్నాయన ఖాదర్ భాషా మరణించిన విషయం తెలిసిందే. ఈదుఃఖకర సందర్భంలోమాజీ మంత్రి ఆర్కే రోజా కార్యకర్త నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఖాదర్ భాషా పార్టీకి అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పార్టీ పరంగా అన్ని విధాల అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. పుత్తూరు రూరల్ మండలం లోని వేణుగోపాలపురం నందు వైయస్ఆర్సీపీ నాయకుడు శేఖర్ మామ ఇటీవల మృతి చెందడంతో, వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఆత్మీయంగా ఓదార్చారు. ప్రజలతో మమేకమైన నేత....నగరి మరియు పుత్తూరు మున్సిపాలిటీలలో ఏ చిన్న కష్టం వచ్చినా ఏ కుటుంబానికి విషాదం ఎదురైనా తాను స్వయంగా వారి వద్దకు వెళ్లి ఓదార్చడం రోజా ప్రత్యేకత.

## అరకొరగా పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్

కనిగిరి: పోలీస్ ఉద్యోగాల నియామకాల కోసం విడుదల చేసిన అరకొర నోటిఫికేషన్ తక్షణమే రద్దుచేసి, ఖాళీగా ఉన్న 11 వేల ఉద్యోగాల భర్తీకి సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య( ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి పోతల ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ నాయకులతో కలిసి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మార్కాపురంలోని ఆర్డీవో కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాదిమంది నిరుద్యోగ యువత ఎంతో కాలంగా పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం కేవలం 2 వేల 50 కానిస్టేబుల్, ఎస్సై పోస్టులతో విడుదల చేసిన నోటిఫికేషన్ ఆ శాఖలోని ఖాళీల అభ్యర్థుల సంఖ్యలకు ఏమాత్రం పొంతన లేకుండా ఉందని విమర్శించారు. సంవత్సరాల తరబడి పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు ఈ నిర్ణయం తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏళ్ల తరబడి నియామకాలు చేపట్టకపోవడం వల్ల వేలాది నిరుద్యోగ అభ్యర్థులు వయో పరిమితిని దాటిపోయి అర్హత కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. పోలీస్ ఉద్యోగాలకు ఐదు సంవత్సరాలు వయోపరిమితి పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ శాఖలో ఉన్న ఖాళీలన్నీ భర్తీ చేయడంవల్ల యువతకు ఉద్యోగ కల్పన లభిస్తుందని సూచించారు. నిరుద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులను సమీకరించి ఉద్యమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు పూర్ణచంద్ర రాజు, పెద్దన్న, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవింగ్ లైసెన్స్ పొందిన రెండో మహిళ సారమ్మ

బేతంచెర్ల : మోటారు వాహన చట్టాలను గౌరవిస్తూ ఆటో నడిపేందుకు డోన్ ఆర్టీవో కార్యాలయం ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ పొందిన బేతంచెర్లకు చెందిన కొమ్మోజీ మిద్దె సారమ్మ ఆదర్శంగా నిలిచారు. ఆర్టీవో పరిధిలో ఆటో డ్రైవింగ్ లైసెన్స్ పొందిన రెండో మహిళగా సారమ్మ గుర్తింపు పొందారు. ఇంతకుముందు భారతి మొదటి మహిళగా లైసెన్స్ పొందారు. లైసెన్స్ లేకుండా ఆటోలు నడుపుతున్న వారు సారమ్మను ఆదర్శంగా తీసుకుని చట్టబద్ధంగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని ఎంవీఐ క్రాంతికుమార్ సూచించారు.

## రైతులు వెళ్లే దారి ఆక్రమించి కంచె ఏర్పాటు

చిట్వేలి : ఎన్నో సంవత్సరాలుగా రైతులు, గ్రామస్తులు వినియోగిస్తున్న పొలాల లోనికి వెళ్లడానికి ఉన్న రహదారికి అడ్డంగా కంచె వెలిసింది. దారి ఆక్రమణకు గురై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని ఆరోపిస్తూ మైలపల్లి పంచాయతీ గొల్లపల్లి గ్రామస్తులు చిట్వేలి మండలం రెవెన్యూ అధికారి నరసింహారావు కు సమర్పించారు. గ్రామకంఠం నుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లే దారిని కొందరు ఆక్రమించి కంచె నిర్మించారని, దీంతో రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. గ్రామకంఠం నుంచి పొలాల్లోకి వెళ్లే ఈ దారిని స్థానికులు ఎన్నో ఏళ్లుగా రాకపోకలకు వినియోగిస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. వ్యవసాయ సీజన్‌లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో పొలాలకు వెళ్లాల్సి ఉండగా, ప్రస్తుతం కంచె ఏర్పాటు చేయడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారిందన్నారు. దారి మూసివేయడంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రికార్డులు పరిశీలించి దారికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, హద్దులు, గ్రామ మ్యాప్‌లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని గ్రామస్తులు కోరారు. దారి ఆక్రమణకు గురైనట్లు రికార్డుల ద్వారా నిర్ధారణ అయితే ఆక్రమణను వెంటనే తొలగించి, గ్రామస్తుల రాకపోకలకు మార్గాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు చిట్వేలి ఎంఆర్ఓ నరసింహారావును కలిసి తమ సమస్యను వివరించారు. సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, దారి విషయంలో స్పష్టత తీసుకురావడంతో పాటు ఆక్రమణలు ఉంటే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల రాకపోకలకు ఆటంకం కలగకుండా అధికారులు తక్షణమే స్పందించాలని గొల్లపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## పట్టా భూమిలో టేకు చెట్లు అక్రమ నరికివేత

కోరుకొండ : బొల్లెత్తుపాలెం – కోటి కేశవరం మధ్యలోని పట్టా భూమిలో ఏకంగా 48 టేకు చెట్లు అక్రమంగా నరికివేతకు గురయ్యాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా చెట్లను నరికి తరలించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కోరుకొండకు చెందిన సామిల్లు మిల్లు నిర్వాహకులే ఎటువంటి అనుమతులు లేకుండా ఈ చెట్లను తరలించారన్న సమాచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పట్టా భూమిలో ఉన్నా సరే టేకు చెట్ల నరికివేతకు వాల్టా చట్టం ప్రకారం అటవీ, రెవెన్యూ శాఖల అనుమతి తప్పనిసరి. అయితే ఈ ఘటనలో ఎటువంటి అనుమతులు తీసుకోలేదని తెలుస్తోంది. ఇంత పెద్ద ఎత్తున చెట్లను తరలించినా కోరుకొండ ఫారెస్ట్ రేంజ్ అధికారులు ఇంతవరకు స్పందించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. సంఘటనా స్థలాన్ని పరిశీలించడం గానీ, పంచనామా చేయడం గానీ, కేసు నమోదు చేయడం గానీ చేయలేదు నీ తెలుస్తుంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పరువురు కోరుతున్నారు.

## అక్కన్నపేట గ్రామంలో పురాతన పాఠశాల భవనం తొలగింపు


రామాయంపేట : మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలోని అప్పర్ ప్రైమరీ పాఠశాల ఆవరణలో పురాతన పాఠశాల భవనాన్ని అధికారులు గ్రామపంచాయతీ సిబ్బంది జేసీబీ ట్రాక్టర్ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బక్కయ్యగారి యాదగిరి మాట్లాడుతూ పాఠశాల ఆవరణలోని పురాతన భవనం 1980 సంవత్సరంలో నిర్మించిందని తెలిపారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున కూలిపోయే దశలో ఉన్న పాత పాఠశాల భవనాలను తొలగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇటీవల అక్కన్నపేట పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ప్రమాదకరంగా ఉన్న పాత పాఠశాల భవనాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పాత భవనాన్ని జేసీబీ ట్రాక్టర్ సహాయంతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా తొలగించినట్లు పేర్కొన్నారు. పాత భవనం తొలగింపుతో విద్యార్థులు ఉపాధ్యాయులకు ప్రమాదం తప్పిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదగిరితో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## రక్తదాన సేవా కార్యక్రమాల్లో ముందంజలో అబ్దుల్ రహ్మాన్

### - ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ భద్రాద్రి జిల్లా సెక్రెటరీ జుబ్బు

కొత్తగూడెం భద్రాద్రి కొత్తగూడెం : కొత్తగూడెం పట్టణంలోని గాజులరాజం బస్తీకి చెందిన యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి ఎం.డి. అబ్దుల్ రహ్మాన్ అలియాస్ జబ్బు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో రక్తదాతలను సమన్వయం చేస్తూ అవసరమైన వారికి సకాలంలో రక్తం అందేలా అహర్నిశలు కృషి చేస్తున్నారు. రక్తదాన శిబిరాల నిర్వహణతో పాటు యువతలో రక్తదానంపై అవగాహన కల్పిస్తూ, స్వచ్ఛంద రక్తదానానికి ప్రోత్సహిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రక్తదాతలను ఏర్పాటు చేయడంలో ఆయన కీలకపాత్ర పోషిస్తున్నారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ మొక్కలు నాటడం, వాటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. అబ్దుల్ రహ్మాన్ సేవలను గుర్తించి హైదరాబాద్‌లోని ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్, గుంటూరులోని గ్రేస్ లైఫ్ ఫౌండేషన్, ఆత్మకూరులోని భారత్ రక్తదానం సేవ మిషన్ ఫౌండేషన్‌ల నుంచి మూడుసార్లు ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ జాతీయ అధ్యక్షుడు జేబీ బాలు, గౌరవ అధ్యక్షుడు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంగం ఎక్కడ పుల్లయ్య, మీడియా ఇన్‌చార్జి, సీనియర్ జర్నలిస్టు, జేఏసీ చైర్మన్ వీరునాయక్, ప్రకృతి ప్రేమికుడు, ఏటీఈసీ జిల్లా అధ్యక్షుడు బాలునాయక్, జిల్లా కార్యదర్శి రాజేష్, హనుమాన్ జిమ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ కమలాకర్‌తో పాటు స్థానికులు అబ్దుల్ రహ్మాన్‌ను అభినందించారు. రక్తదానం, పర్యావరణ పరిరక్షణ వంటి సామాజిక కార్యక్రమాల్లో ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు..

# గ్రాడ్యుయేట్ ఎన్నికల కోసం కసరత్తు షురూ



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో మరో ఆసక్తికరమైన రాజకీయ పోరుకు రణభేరి మోగింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ మరియు వరంగల్-ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల పదవీకాలం మార్చి 2027తో ముగియనుండటంతో, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారికంగా కొత్త ఓటర్ల జాబితా షెడ్యూల్‌ను విడుదల చేశారు. ప్రస్తుత సభ్యులైన సురభి వాణిదేవి, తీన్మార్ మల్లన్న ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ రెండు స్థానాల్లో ఎన్నికల కసరత్తు షురూ కావడంతో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, సీనియర్ పట్టభద్రుల పట్టున్న బీజేపీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన మైలురాయి.. సెప్టెంబర్ 28న విడుదల కానున్న పబ్లిక్ నోటీస్, ఫారం-18 ద్వారా ఓటర్ల నమోదు ప్రారంభం కావడం. గతంలో ఎంతమంది ఓటర్లు నమోదై ఉన్నప్పటికీ, గ్రాడ్యుయేట్ స్థానాల నిబంధనల ప్రకారం పాత ఓటర్ల జాబితా రద్దవుతుంది. ప్రతిసారి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే. నవంబర్ 6 వరకు ఫారం-18 స్వీకరించి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. అంటే, దాదాపు 7 లక్షల మందికి పైగా ఉండే అవకాశం ఉన్న పట్టభద్రుల ఓట్లలో.. ఎవరు ఎక్కువ మంది నిజమైన మద్దతుదారులను ఫారం-18 నింపి ఓటర్లుగా నమోదు చేయించగలుగుతారో, వారికే పోలింగ్ రోజు సగం విజయం ఖాయమవుతుంది. ఈసారి పట్టభద్రుల సమరం చతుర్ముఖ పోటీని తలపిస్తోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాలు, జాబ్ క్యాలెండర్, డిఏ, పెన్షన్ అంశాలను ప్రధాన ప్రచారాస్త్రాలుగా మార్చుకుని నిరుద్యోగులు, ఉద్యోగుల ఓట్లను ఆకర్షించేందుకు ప్లాన్ చేస్తోంది. తమ బలాన్ని నిరూపించుకోవడానికి కాంగ్రెస్ యంత్రాంగం క్షేత్రస్థాయి వరకు ఫారం-18 దరఖాస్తులను చేరవేసి రికార్డు స్థాయిలో ఓటర్లను నమోదు చేయించే పనిలో పడింది. అటు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి ఇది అతిపెద్ద అగ్నిపరీక్ష. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తర్వాత గ్రాడ్యుయేట్ వర్గాల్లో ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అమలులో జాప్యం వంటి అంశాలను లేవనెత్తి విద్యావంతు లను తమ వైపు తిప్పుకోవాలని చూస్తోంది. గతంలో గెలిచిన మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ సీటును నిలబెట్టుకోవడంతో పాటు నల్గొండ-వరంగల్-ఖమ్మంలోనూ బలమైన పోటీ ఇచ్చేందుకు కేటీఆర్, హరీష్ రావులు ప్రత్యేకంగా టీమ్‌లను ఏర్పాటు చేసి ఓటర్ల నమోదు బాధ్యతలను స్థానిక నేతలకు అప్పగిస్తున్నారు. మరోవైపు హైదరాబాద్, రంగారెడ్డి మరియు నల్గొండ పట్టభద్రుల స్థానాల్లో బీజేపీకి సంప్రదాయంగా బలమైన ఓటు బ్యాంకు ఉంది. విద్యావంతులు, ఐటీ నిపుణులు, ఆర్ఎస్ఎస్ అనుబంధ వర్గాల్లో ఆ పార్టీకి మంచి పట్టు ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న మైలేజ్‌తో పాటు రాష్ట్ర సర్కార్ వైఫల్యాలను ఎండగడుతూ అర్బన్ ప్రాంతాల్లో అత్యధికంగా ఆన్‌లైన్ ద్వారా ఓట్లను నమోదు చేయించే వ్యూహంతో బీజేపీ సమాయత్తమవుతోంది. దీనికి తోడు తీన్మార్ మల్లన్న, ఇతర స్వతంత్ర, యువజన సంఘాల నాయకులు కూడా బరిలోకి దిగుతుండటంతో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు అత్యంత ఉత్కంఠభరితంగా మారనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి 'అభ్యర్థి ఇమేజ్' ఎంత ముఖ్యమో.. 'ఓటర్ల నమోదు డిజైన్' అంతకంటే వెయ్యింతలు ముఖ్యం. డిగ్రీ సర్టిఫికేట్లు సేకరించి, గెజిటెడ్ అటెస్టేషన్ చేయించి, గడువులోగా ఫారం-18 అధికారులకు చేరేలా ఏ పార్టీ యంత్రాంగం నెట్‌వర్క్‌ను పక్కాగా నడుపుతుందో.. ఆ పార్టీయే మార్చి 2027 పట్టభద్రుల పోరులో విజేతగా నిలుస్తుంది.

# సింగిల్ విండో అనుమతులు కోసం యత్నాలు

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ , నూతన హెచ్ఎండీఏ పరిధిలో భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ అప్రూవల్స్ ప్రక్రియను మరింత సరళతరం చేయాలని రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రముఖ అసోసియేషన్లు ప్రభుత్వాన్ని గట్టిగా కోరుతున్నాయి. ప్రస్తుతం వివిధ విభాగాల నుంచి ఎన్‌ఓసీలు పొందడంలో జరుగుతున్న జాప్యం, వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా ప్రాజెక్ట్‌ల నిర్మాణం ఆలస్యమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో అక్రమాలను అరికడుతూ, పూర్తి పారదర్శకతతో కూడిన సేవలు అందించేందుకు ఒక సమగ్ర సింగిల్ విండో వ్యవస్థను తక్షణమే అమల్లోకి తేవాలని డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న ఆన్‌లైన్ అనుమతుల విధానం కొన్ని వెసులుబాట్లు కల్పిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇంకా అనేక సాంకేతిక , అధికారిక ఇబ్బందులు వేధిస్తున్నట్లు డెవలపర్లు వాపోతున్నారు. ఫైళ్లు వివిధ శాఖల చుట్టూ తిరగడం వల్ల వడ్డీ భారం పెరిగి, చివరికి అది ఇళ్ల కొనుగోలుదారులపై అదనపు ఆర్థిక భారంగా మారుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా అన్ని రకాల క్లియరెన్స్‌లను ఒకే గొడుగు కిందకు తెచ్చే సరికొత్త సింగిల్ విండో విధానం అత్యవసరమని రియల్ ఎస్టేట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ ప్రతిపాదిత సింగిల్ విండో వ్యవస్థ ద్వారా దరఖాస్తు చేసుకున్న నిర్దిష్ట కాలపరిమితిలోగా అన్ని అనుమతులు మంజూరయ్యేలా నిబంధనలు రూపొందించాలని కోరుతున్నారు. ఫైర్ సేఫ్టీ, రెవెన్యూ, అటవీ, పర్యావరణం , స్థానిక పట్టణాభివృద్ధి సంస్థల నుంచి వేర్వేరుగా అనుమతులు తెచ్చుకునే నరకయాతన తప్పుతుందని, దీనివల్ల చిన్న , మధ్యతరగతి బిల్డర్లకు ఎంతో ఊరట లభిస్తుందని పేర్కొంటున్నారు. పారదర్శకత పెరిగితే ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతో పాటు వినియోగదారులకు కూడా సరసమైన ధరల్లో గృహాలు లభించే అవకాశం ఉంటుందని వాదిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం, సంబంధిత పురపాలక శాఖ ఈ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, రియల్ ఎస్టేట్ రంగానికి మరింత ఊతమిచ్చేలా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ నగర బ్రాండ్ ఇమేజ్ వేగంగా మారుతున్న తరుణంలో, మౌలిక సదుపాయాల కల్పనలో , అనుమతుల జారీలో ఈ రకమైన ఆధునిక సంస్కరణలు ఎంతైనా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం కనుక సింగిల్ విండో విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తే, దేశవ్యాప్తంగా ఉన్న పెద్ద ఇన్వెస్టర్లు మరెన్నో ప్రాజెక్ట్‌లతో భాగ్యనగరం వైపు క్యూ కట్టే అవకాశం ఉంది.

## తల్లి పేరుతో ఒక మొక్క నాటండి

భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి తల్లి పేరుతో ఒక మొక్క నాటండి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఎకో క్లబ్, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ మాట్లాడుతూ? ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో మొక్క నాటడం ద్వారా, కోట్ల మొక్కలు నాటబడతాయని తద్వారా అవి పెరిగి పర్యావరణాన్ని కాపాడతాయని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో స్థానిక ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డా. నాజ్నిన్ తబస్సుమ్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ? వృక్షాలు మనకు ఆక్సిజన్ ను అందిస్తాయని, మన ఆరోగ్యానికి ఇది ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఇంచార్జి శంకర్ మహదేవన్, సునంద రెడ్డి, ఎకో క్లబ్ ఇంచార్జి మొత్కూరి పద్మ, ఉపధ్యాయులు శాంత, బాబురావు, వెంకటేశ్వర రావు,సుశీల,మోతిలాల్, జయరాం, పాఠశాల కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు, శిరీష, ఖాసీం, ఎకో క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మొల్లేరు అంగన్ వాడీలో పోషకాహారంపై అవగాహన

గంగవరం : పోలవరం జిల్లా గంగవరం మండలం మొల్లేరు గ్రామంలోని అంగన్ వాడీ 1వ సెంటర్ లో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు, ప్రీ-స్కూల్ పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారం ప్రాధాన్యత గురించి వారికి వివరించారు. పిల్లల ఎదుగుదలకు, తల్లుల ఆరోగ్యానికి సరైన పోషకాహారం ఎంత అవసరమో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పోలవరం జిల్లా ఓబీసీ మోర్చా జనరల్ సెక్రెటరీ ఎం. సూర్యచంద్ర, పోలవరం జిల్లా మహిళా మోర్చా సెక్రెటరీ ఎం. వెంకటరత్నం, ఐసీడీఎస్ మేడం, అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నల్లేరు మీద నడక అవుతుందా... కొత్త అభ్యర్థా?



హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లారు దానం నాగేందర్. అయితే ఆయన మొదట సుప్రీంకోర్టుకు వెళ్లనని ఖైరతాబాద్ ఉపఎన్నికను నేరుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. కానీ ఓ చాయిస్ ఉన్నప్పుడు ఎందుకు వదులుకోవడం ఆయన పిటిషన్ వేశారు కానీ.. సుప్రీం కోర్టులో ఊరట లభించడం కష్టమేనన్న అభిప్రాయంబలంగా ఉంది. చట్టపరంగా అనర్హత వేటు పడినప్పటికీ, తదుపరి జరిగే ఉపఎన్నికలో పోటీ చేయకుండా నిరోధించే నిబంధన ఏదీ లేదు కాబట్టి దానం నాగేందర్ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగడం దాదాపు ఖాయమైంది. ఈ పరిణామంతో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యం కాగా, ఇక్కడ రాజకీయ పరిస్థితులు పూర్తిగా దానం నాగేందర్ చుట్టూనే తిరుగుతున్నాయి. ఖైరతాబాద్ నియోజక వర్గ చరిత్రను పరిశీలిస్తే.. పార్టీల సిద్ధాంతాల కంటే దానం నాగేందర్ వ్యక్తిగత ప్రభావమే ఇక్కడ ఎక్కువ పనిచేస్తుందని స్పష్టమవుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఏవైనా సరే.. నియోజకవర్గంలోని ప్రతి బస్తీ, డివిజన్ స్థాయి నేతలతో ఆయనకు దశాబ్దాలుగా ఉన్న ప్రత్యక్ష పరిచయాలు, బలమైన అనుచరగణమే ఆయన ప్రధాన బలం. ఖైరతాబాద్‌లో ప్రత్యేకంగా ఏ ప్రతిపక్ష పార్టీకీ బలమైన సంస్థాగత క్యాడర్ నిర్మాణం లేకపోవడంతో, దానం నెట్‌వర్కే ప్రధాన శక్తిగా నిలుస్తోంది. ఇక పార్టీల సమీకరణాల పరంగా చూస్తే, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఖైరతాబాద్‌తో సంప్రదాయబద్ధంగా పాత ఓటుబ్యాంకు ఉంది. దానం నాగేందర్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీకి దిగినప్పుడు.. ఆయన వ్యక్తిగత ఇమేజ్, బస్తీల్లో ఉన్న పట్టుకు తోడు కాంగ్రెస్ పార్టీ సంప్రదాయ ఓటుబ్యాంకు, శ్రేణులు ఏకమవుతాయి. దీనికి తోడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగం, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల హోదా తోడవటం దానం నాగేందర్‌కు ఉపఎన్నికలో భారీ అడ్వాంటేజ్‌గా మారే అవకాశం ఉందనేది పొలిటికల్ ట్రెండ్స్ చెబుతున్నాయి. ఈ పరిస్థితి ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు అతిపెద్ద సవాలుగా మారింది. ఖైరతాబాద్‌లో స్థానికంగా దానం స్థాయి బలమైన, నియోజకవర్గమంతా తెలిసి ఉన్న ప్రత్యామ్నాయ నాయకుడు బీఆర్ఎస్‌కు లేకపోవడం పెద్ద లోటు. గతంలో దానంను నమ్ముకునే అక్కడ బీఆర్ఎస్ రాజకీయం నడిచింది. ఇప్పుడు ఆయననే ఎదుర్కొని నిలబడటానికి బలమైన లోకల్ క్యాడర్, సమర్థుడైన అభ్యర్థి దొరకడం గులాబీ పార్టీకి కత్తిమీద సాము లాంటిదే. ప్రభుత్వ బలం, దానం పర్సనల్ క్యాడర్‌ను తట్టు కుని పోరాడటం బీఆర్ఎస్‌కు అంత తేలికైన విషయం కాదుమరోవైపు భారతీయ జనతా పార్టీ పరిస్థితి కూడా ఇక్కడ ఏమంత ఆశాజనకంగా లేదు. గతంలో తెలుగు దేశం పార్టీ తో పొత్తు ఉన్న సమయంలో మాత్రమే బీజేపీ ఈ నియోజకవర్గంలో విజయం సాధించగలిగింది. ఆ తర్వాత ఒంటరిగా పోటీ చేసిన ప్రతిసారి డిపాజిట్ కోల్పోవడం లేదా నామమాత్రపు ఓట్లకే పరిమితమవ్వడం జరిగింది. నగర పరిధిలో ఉనికి ఉన్నప్పటికీ, ఖైరతాబాద్‌లోని స్థానిక బస్తీ ఓటర్లను ఆకట్టుకునే స్థాయి బలమైన కేడర్ గానీ, అభ్యర్థి గానీ బీజేపీకి కూడా పెద్దగా అందుబాటులో లేరు. ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యమైన వేళ, మిగిలిన ప్రతిపక్ష పార్టీల వద్ద గట్టి అభ్యర్థులు, బలమైన క్యాడర్ లేకపోవడం దానం నాగేందర్‌కు ప్లస్ పాయింట్‌గా మారుతోంది. చట్టపరమైన తీర్పు దానంకు ప్రతికూలంగా వచ్చినా, ప్రజాక్షేత్రంలో మాత్రంఅధికార పార్టీ బలం, తన సొంత ఇమేజ్, స్థానిక బస్తీ ఓటర్ల మద్దతుతో ఆయన మరోసారి విజయం సాధించే అవకాశాలే మెండుగా ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## ఖైరతాబాద్ నుంచి సాయికిరణ్ పోటీ..?

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఖైరతాబాద్ నియోజకవర్గం ఉపఎన్నిక వ్యవహారం కీలక చర్చనీయాంశంగా మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించిన దానం నాగేందర్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజక వర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. పార్టీ మారిన ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని బీఆర్ఎస్ న్యాయ పోరాటం చేసింది. చివరకు ఆయనపై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇవాళ లేదంటే రేపు సుప్రీంకోర్టులో తీర్పు వచ్చే అవకాశం ఉంది. అయితే, హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు న్యాయనిపుణులు పేర్కొంటున్నారు. అదే జరిగితే ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యమైనట్లే. ఇప్పటికే బీఆర్ఎస్ అధిష్టానం ఖైరతాబాద్ నియోజకవర్గంపై దృష్టిసారించింది. ఉపఎన్నిక వస్తే బరిలో ఎవరిని నిలపాలనే అంశంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యనేతలతో చర్చించినట్లు సమాచారంఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో విజయం సాధించి అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ ఇవ్వాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఈ క్రమంలో అభ్యర్థి ఎంపికపై ఆచితూచి అడుగులు వేయాలని గులాబీ పార్టీ అధిష్టానం డిసైడ్ అయింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌లో ఖైరతాబాద్ టికెట్ ఆశిస్తున్న నేతలు.. ఎవరి ప్రయత్నాల్లో వాళ్లు బిజీ అయిపోయారు. ప్రముఖంగా పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మన్నె గోవర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు సాయికిరణ్ యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే, సాయికిరణ్ యాదవ్‌ను బరిలోకి దింపాలనే ఆలోచనలో బీఆర్ఎస్ అధిష్టానం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో అభ్యర్థి ఎంపికపై కేసీఆర్ పార్టీ ముఖ్యనేతలతో చర్చించినట్లు సమాచారం. ఈ క్రమంలో తసాని శ్రీనివాస్ యాదవ్ కుమారుడు సాయి కిరణ్ కు టికెట్ ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తసాని శ్రీనివాస్ యాదవ్ కు ఫోన్ చేసి ఖైరతాబాద్ ఉప ఎన్నికలో సాయికిరణ్ ను పోటీకి పెట్టేందుకు సిద్ధం కావాలని కేసీఆర్ సూచించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. సాయికిరణ్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన తొలి లోక్ సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యాడు.

గత ఎన్నికల్లోనూ అదే పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలని భావించినప్పటికీ.. చివరి నిమిషంలో అధిష్టానం ఆ స్థానం నుంచి పద్మారావుగౌడ్ ను బరిలోకి దింపింది. అయితే, తలసాని శ్రీనివాస్ యాదవ్ కు ఖైరతాబాద్ నియోజకవర్గంలో గట్టి పట్టుంది. మంత్రిగా ఈ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనుల్లో తలసాని కీలకంగా వ్యవహరించడం కలిసి వస్తుందని బీఆర్ఎస్ అధిష్టానం భావిస్తోంది. దీనికితోడు తలసాని సామాజిక వర్గంకు చెందిన ఓటర్లతోపాటు ఇతర బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఈ నియోజకవర్గంలో ఎక్కువగా ఉండటంతోపాటు.. వీరిలో ఎక్కువశాతం తలసాని కుటుంబానికి సానుకూలంగా ఉండటంతో బీఆర్ఎస్ అధిష్టానం సాయికిరణ్‌ను బరిలోకి దింపేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

## జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం

కొత్తగూడెం : పర్యావరణ పరిరక్షణలో తనదైన ముద్ర వేస్తూ, చిన్న వయసులోనే పెద్ద లక్ష్యంతో ముందుకు సాగుతున్న తెలంగాణ బాల ప్రకృతి ప్రేమికుడు విశ్వామిత్ర చౌహాన్ కు అరుదైన జాతీయ గౌరవం దక్కింది. ప్రతిష్టాత్మక "రాష్ట్రీయ హరిత గౌరవ పురస్కార్ 2026" కు ఎంపికయ్యాడు. రాజస్థాన్ కేంద్రంగా 40 ఏళ్లుగా పర్యావరణ సేవలో తలమునకలై, కోట్లాది మొక్కలు నాటి "ట్రీ మ్యాన్ ఆఫ్ ఇండియా" గా పేరుగాంచిన శ్రీ విష్ణు లాంబా ఆధ్వర్యంలోని కల్పతరు సంస్థాన్ ఈ అవార్డులను అందజేస్తోంది. ఈ నెల 27వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జైపూర్ లోని కనోరియా పీజీ మహిళా మహావిద్యాలయ ఆడిటోరియం, జెఎల్ఎన్ మార్గ్ లో జరిగే "పర్యావరణ మహాకుంభ్" కార్యక్రమంలో దేశం నలుమూలల నుండి ఎంపికైన 25 మంది ప్రకృతి ప్రేమికులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు, కేంద్ర మంత్రులు, ప్రముఖుల సమక్షంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. గతంలో ఈ పురస్కారాన్ని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ అందుకోవడం విశేషం. ఈ పురస్కారాన్ని ఆ రాష్ట్ర గవర్నర్ హరిబావు భాగ్డే చేతుల మీదుగా అందుకున్నారు అవార్డు కార్యక్రమంలో గతంలో మరో గవర్నర్ కల్రాజ్ మిశ్రా పాల్గొని అవార్డులు ప్రధానం చేశారు అటువంటి ప్రతిష్టాత్మక జాబితాలో చిన్నారి విశ్వామిత్ర చౌహాన్ చోటు దక్కించుకోవడం తెలంగాణకు గర్వకారణం. అయితే ఈ సందర్భంగా విశ్వామిత్ర చౌహాన్ చూపిన నిబద్ధత అందరినీ ఆలోచింపజేస్తోంది. జైపూర్ వెళ్లి రావడానికి ప్రయాణ ఖర్చులు ఎక్కువ అవుతున్నాయని, ఆ ఖర్చుతో అవార్డు కోసం వెళ్లడం కంటే, ఆ డబ్బులతో అన్ని మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచుతానని తనకు అవార్డులు, రివార్డులు ముఖ్యం కాదని, పచ్చదనం పెంచడమే తన జీవిత లక్ష్యమని స్పష్టం చేశాడు. అవార్డు కంటే ఆలోచన గొప్పదన్న ఈ బాలుడి మాట నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం. అయినప్పటికీ నిర్వాహకులు విశ్వామిత్ర కోసం ప్రత్యేకంగా ప్రయాణ ఖర్చులు తాము భరించి ఆహ్వానించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. చిన్న వయసులోనే పెద్ద ఆలోచనలతో, భావి తరాలకు పచ్చని భవిష్యత్తును అందించాలనే తపనతో ముందుకు సాగుతున్న విశ్వామిత్ర చౌహాన్ కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

స్పెషల్ ఎడిషన్ తెలుగు దినపత్రిక

గురువారం, సెప్టెంబర్ 24, 2026

## బద్వేల్‌లో మరో రహదారి అభివృద్ధికి శ్రీకారం

బద్వేలు:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కడప రోడ్డు నుంచి భాకరాపేట వరకు 2.3 కిలోమీటర్ల రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మరియు ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన మంచూరు సూర్యనారాయణ రెడ్డి విచ్చేసి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ రహదారి నిర్మాణానికి రూ. 1.26 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. రహదారి నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు, బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. బద్వేల్ నియోజకవర్గంలోప్రజలకు అవసరమైన మౌలికవసతులఅభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంచూరు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు.

## అంగన్వాడీ టీచర్ బండారి ఉమామహేశ్వరి మృతి పట్ల సంతాపం

కురవి : మండల కేంద్రానికి చెందిన అంగన్వాడీ టీచర్ బండారి ఉమామహేశ్వరి గుండెపోటుతో మృతిచెందడంతో, వారి పార్థివ దేహానికి కురవి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ గౌడ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కురవి సమన్వయ కమిటీ అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు అంబటి వీరభద్ర గౌడ్ , ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ సభ్యులు గొల్లపల్లి రజనీకాంత్ , మండల ఉపాధ్యక్షులు బానోత్ తుకారం నాయక్ గారు, వాగ్య నాయక్ , దొంగల జనార్ధన్ రెడ్డి , మండల ప్రధాన కార్యదర్శి లింగ నాయక్ , మండల కార్యదర్శి బండి మల్లయ్య , మండల యూత్ అధ్యక్షులు దడిగల శరత్ , ఆలయ ధర్మకర్త చిన్నం గణేష్ , ఉప సర్పంచ్ దయ్యాల శ్రీధర్ , గ్రామ అధ్యక్షులు రాముల వెంకన్న, వార్డు సభ్యులు మోహన్ మాజీ వార్డు సభ్యులు లక్ష్మణ్ నాయక్ తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం..

### 374 మంది రైతులకు రూ.15 లక్షల వడ్డీ లేని రాయితీ చెక్కుల పంపిణీ

చందర్లపాడు: మండలంలోని కోనయపాలెం గ్రామంలో గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) ఆధ్వర్యంలో రైతులకు వడ్డీ లేని రాయితీ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్, కూటమి నేతలు, అధికారులతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య గారు పాల్గొని 374 మంది రైతులకు మొత్తం రూ.15 లక్షల విలువైన వడ్డీ లేని రాయితీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గారు మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులకు పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రైతుల్లో భరోసాను నింపుతున్నాయని ఎమ్మెల్యే సౌమ్య గారు అన్నారు. కార్యక్రమంలో లాల్ బహుదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు,అధికారులు, సహకార సంఘం సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ టెండర్లలో 'సిండికేట్' కలకలం

- రూ.50 కోట్ల జఐఆఈ పనులపై రాజకీయ దుమారం
- సింగిల్ టెండర్లపై అనుమానాలెందుకు?
- అధికార ప్రతిపక్షాల మౌనంపై ప్రశ్నలు
- టెండర్లు రద్దు చేసి సమగ్ర విచారణ జరపాలంటున్న వామపక్షాలు
- బండి సంజయ్ ఎలా స్పందిస్తారోనని నగరవాసుల ఎదురుచూపు

కరీంనగర్ : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత ద్వితీయ శ్రేణి నగరాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా కరీంనగర్ ముందుకు సాగుతోంది. స్మార్ట్ సిటీ, జఐఆఈ తదితర పథకాల కింద భారీగా నిధులు రావడంతో నగరంలో రోడ్లు, డ్రైనేజ్‌లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. అయితే కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించే ఈ పనుల టెండర్ ప్రక్రియపై తాజాగా ఆరోపణలు, అనుమానాలు తెరపైకి రావడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జఐఆఈ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లలో పోటీ పరిమితం కావడం, కొన్ని పనులకు సింగిల్ బిడ్లు రావడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పలు జఐఆఈ పనులకు ఒక్కో బిడ్డర్ మాత్రమే పాల్గొన్నట్లు అందుబాటులో ఉన్న టెండర్ రికార్డులు చూపిస్తున్నాయి. రూ.50 కోట్ల పనులు.. సింగిల్ టెండర్లపై చర్చ జఐఆఈ పథకం కింద కరీంనగర్ కార్పొరేషన్‌కు సంబంధించిన సుమారు రూ.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులపై ప్రస్తుతం నగరంలో చర్చ జరుగుతోంది. ఈ నిధులతో రోడ్లు, డ్రైనేజ్‌లు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక వసతుల పనులు చేపట్టనున్నారు. ఇటీవలే ఈ పథకం కింద రూ. 50 కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడించినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇంత పెద్ద మొత్తంలో ప్రజాధనం వెచ్చిస్తున్న సమయంలో ప్రతి పనికి తగినంత పోటీ ఉండేలా టెండర్ ప్రక్రియ జరిగిందా? సింగిల్ బిడ్లు ఎందుకు వచ్చాయి? కాంట్రాక్టర్ల మధ్య పోటీ ఎందుకు కనిపించలేదు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొన్ని జఐఆఈ పనుల టెండర్ రికార్డుల్లో ఒక్క బిడ్డర్ మాత్రమే పాల్గొన్న సందర్భాలు కూడా నమోదయ్యాయి. ఉదాహరణకు ఓపెన్‌టెండర్లో ఒక జఐఆఈ పనికి ఒక బిడ్డర్ మాత్రమే పాల్గొన్నట్లు టెండర్ డేటా పేర్కొంటోంది.

## గిరిజనుల హక్కుల కోసం ఐక్య పోరాటాలను బలోపేతం చేయాలి

### గిరిజన సంఘం(టీజీఎస్) రాష్ట్ర కార్యదర్శి రమావత్ శ్రీరామ్ నాయక్

మహబూబాబాద్: తెలంగాణ గిరిజన సంఘం మహబూబాబాద్ జిల్లా 4వ మహాసభను ఉద్దేశించి గిరిజన సంఘం (టీజీఎస్) రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్ నాయక్ మాట్లాడుతూ... గిరిజనులు ఎదుర్కొంటున్న భూమి, అటవీ హక్కులు, ఉపాధి, విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. గిరిజనుల హక్కుల కోసం గతంలో జరిగిన పోరాటాల స్ఫూర్తితో నేటి సమస్యలపై కూడా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గిరిజనుల భూములకు రక్షణ కల్పించడం, పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం, అటవీ హక్కుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, గిరిజన ప్రాంతాల్లో విద్యా వైద్య సదుపాయాలను మెరుగుపరచడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధి అవకాశాల లేమి కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు టీజీఎస్ గిరిజన సంఘం నిరంతరం ప్రజల పక్షాన నిలబడుతుందని తెలిపారు. గిరిజనుల హక్కుల సాధన కోసం గ్రామస్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేయాలని, యువత, మహిళలు ఉద్యమాల్లో భాగస్వాములను చేయాలని శ్రీరామ్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మహాసభలో జిల్లా ప్రజా సంఘాలు,నాయకులు, మండల, ప్రజా సంఘాల నాయకులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరువు పరిస్థితులపై కదిలిన ప్రభుత్వం

### క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదికలకు ప్రభుత్వ ఆదేశం

### కసరత్తు ప్రారంభించిన వ్యవసాయ శాఖ.. జిల్లా మొత్తం గుర్తింపు

ఒంగోలు : ఖరీఫ్‌లో నెలకొన్న కరువు పరిస్థితులపై ప్రభుత్వం కదిలింది. సాధారణంగా సీజన్ ముగిశాక మొత్తం పరిస్థితిని అంచనా వేసి సహాయక చర్యలకు ఉపక్రమిస్తుంది. అయితే ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచి రాష్ట్రంలోని అత్యధిక ప్రాంతాల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక, ఆశించిన స్థాయిలో కృష్ణా నదిలో నీటి ప్రవాహం రాక పంటలు సాగు కాలేదు. జిల్లాలోనూ పరిస్థితి చాలా తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో కరువు ప్రాంతాలను గుర్తించి రబీ ఆరంభం నుంచే ప్రత్యామ్నాయ పంటల సాగు, అందుకు అవసరమైన ఇన్‌పుట్స్ అందజేత, ఇతర చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కరువు నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేసి అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. మూడు, నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో కరువు ప్రాంతాలను ప్రకటించి సహాయక చర్యలు చేపడితే ఈ వర్షాల అనంతరం రైతులు పంట సాగుకు ఉపయోగంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ప్రాథమికంగా రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లో నమోదైన వర్షపాతం వివరాలను ప్రభుత్వ స్థాయిలో పరిశీలించి మండలాల వారీగా ఎక్కడ కరువు తీవ్రత ఎలా ఉందో ఇప్పటికే ఒక అంచనాకు వచ్చింది. ఆ జాబితాలను జిల్లా లకు పంపించి వాటి ఆధారంగా క్షేత్రస్థాయి లో పరిస్థితులను పరిశీలించి పంటల సాగు, దిగుబడులపై ప్రభావం, ఇతరత్రా వివరా లతో నివేదికలను కోరింది. ఆ మేరకు ఆదేశా లు రెండు రోజుల క్రితం జిల్లా అధికారులకు అందాయి. తదనుగుణంగా క్షేత్రస్థాయి పరిస్థి తులపై వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలన ప్రారంభించారు.

**మొత్తమంతా తీవ్రంగానే కరువు**

ప్రభుత్వం నుంచి వర్షపాతం నమోదు ఆధారంగా అందిన వివరాల ప్రకారం సింగరాయకొండ, ఉలవపాడు మండలాల్లో మధ్యస్థంగా.. ఇతర అన్ని మండలాల్లో తీవ్రంగా కరువు ఉన్నట్లు సమాచారం. ఆయా మండలాల్లో 10శాతం గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. అలాగే ఆ గ్రామాల్లో కనీసం ఐదు సర్వేనెంబర్లలో సాగైన పంటలను చూసి వాటి దిగుబడులను అంచనా వేయాలి. గతంలో ఆ గ్రామంలో సదరు పంట సాగైనప్పుడు వచ్చిన ఉత్పత్తిలో ఈసారి 33శాతం కన్నా తక్కువగా ఉంటే కరువు ప్రాంతాలుగా ప్రకటిస్తారు. అసలు పంటలు సాగు కాకపోయినా కరువు ప్రాంతాలుగా ప్రకటిస్తారు. జిల్లాలో పరిస్థితి చూస్తే ఏ ఒక్క ప్రాంతంలోనూ పంటలు ఈ సీజన్‌లో సరిగా సాగు కాలేదు. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 55,774 హెక్టార్లు కాగా కేవలం 18శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి. అంటే పదివేల హెక్టార్లలో కూడా పైర్లు పడలేదు. ప్రధానమెట్ట పంటలలో కంది 9.86శాతం, పత్తి 6.53శాతం, మొక్కజొన్న 54శాతం, సజ్జ 30శాతం, వరి 29శాతం విస్తీర్ణంలో సాగు కాగా వర్షాలు లేక అన్ని పంటలు ఎండిపోయి దిగుబడులు వచ్చే అవకాశాలు లేకుండా పోయాయి. సోమ, మంళవారాల్లో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో నిర్వహించిన పరిశీలనల్లోనూ ఇదే విషయాన్ని గుర్తించినట్లు సమాచారం.

**18 మండలాల్లో తీవ్రం.. 10 చోట్ల మధ్యస్తం**

జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై వ్యవసాయశాఖ ఒక అంచనాకు వచ్చింది. మొత్తం 28 మండలాలు జిల్లాలో ఉండగా 18 మండలాల్లో కరువు తీవ్రంగా, మరో 10 చోట్ల మధ్యస్తంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ సీజ న్‌లో నమోదైన వర్షపాతం, పంటల సాగు విస్తీర్ణం, పంట ఉత్పత్తి అంచనాలను పరిగణనలోకి తీసుకొని వాటిని అలా అంచనా వేశారు. తదనుగుణంగా ప్రభుత్వానికి కలెక్టర్ ద్వారా నివేదించనున్నారు. తీవ్ర కరువుగా గుర్తించిన మండలాల్లో మద్రిపూడి, కొండపి, మద్దిపాడు, పొన్నలూరు, సింగరాయకొండ, ఎస్ఎన్‌పాడు, తాళ్లూరు, జరుగుమల్లి, గుడ్లూరు, దర్శి, చీమకుర్తి, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు, టంగుటూరు, కందుకూరు, వీవీపాలెం, ఒంగోలు రూరల్, అర్బన్ ఉన్నాయి. మధ్యస్థంగా ఉలవపాడు, గుడ్లూరు, సంతమాగులూరు, అద్దంకి, బల్లికురవ, జె.పంగులూరు, కొత్తపట్నం, కొరిశపాడు, లింగసముద్రం మండలాలు ఉన్నాయి.

**వచ్చేనెల 1న కరువు మండలాల ప్రకటన**

జిల్లావ్యాప్తంగా తీవ్ర కరువు పరిస్థితి ఉన్న విషయాన్ని నిర్ధారించుకున్న వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వివరాలు నమోదు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించగా మండలాల వారీ వివరాలను అందులో ఇప్పటికే మండల స్థాయి అధికారులు నమోదు చేశారు. వాటిని జిల్లాస్థాయిలో క్రోడీకరించి కరువుపై సమగ్ర నివేదికను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి వ్యవసాయశాఖ అధికారులు పంపించనున్నారు. ఇదిలాఉండగా వచ్చే నెల 1న రాష్ట్రంలో కరువు ప్రాంతాలను ప్రకటించే అవకాశం ఉన్నట్లు వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు వెల్లడించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంగళవారం జిల్లాకు వచ్చిన ఆయన ఒంగోలులో ఆధునికీకరించిన పీడీసీసీ బ్యాంకు భవనాన్ని ప్రారంభించారు. అక్కడ మీడియాతో మాట్లాడిన ఆయన ఎల్‌నినో వల్ల తీవ్ర కరువు వచ్చిందని దాని నుంచి రైతులను, వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నదన్నారు.

# కవిత సమరశంఖం



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ లో కవిత సమర శంఖం పూరించారు. ఆదివారం కొడంగల్ వేదికగా జరిగిన పాంచ జన్య సంకల్ప సభలో కవిత ఓపెన్ గా మాట్లాడారు. ఎటువంటి ఫిల్టర్లు లేకుండా తన అభిప్రాయాన్ని.. మొహమాటం లేకుండా చెప్పేశారు.నేను వాళ్ళు వదిలిన బాణం.. వీళ్ళు వదిన బాణం కాదు. అలాంటి తలకాయ లేని మాటలు మాట్లాడను. అలాంటి వారి కోసం నేను కొడంగల్ గడ్డమీద నుంచి చెబుతున్న. ఇప్పటికీ అధికారానికి.. విద్యకు దూరంగా ఉన్న మా బహుజనుల బాణాన్ని నేను. యువకుల యుద్ధ నినాదాన్ని నేను. వారికోసం మోడీతో కొట్లాడుతా. రేవంత్ రెడ్డితో కొట్లాడుతా. చివరికి కేసీఆర్ తో నైనా కొట్లాడుతా. తద్వారా తన మీద వస్తున్న విమర్శలకు ఈ స్థాయిలో కవిత సమాధానం చెప్పారు. అంతేకాదు తనమీద అవాకులు చవాకులు పేరుతున్న గులాబీ పార్టీ సోషల్ మీడియా.. ఆ పార్టీ అనుబంధ సోషల్ మీడియా గ్రూపులకు కవిత గట్టిగానే కౌంటర్ ఇచ్చారు.వాస్తవానికి కవిత పాంచ జన్య సభలో గట్టిగా మాట్లాడారు. ఒక రకంగా దీనిని ఎన్నికల సభ లాగా ఆమె చాలెంజ్ గా తీసుకొని ప్రసంగించారు.. ప్రారంభం నుంచి చివరి దాకా బహుజనుల విషయాలను ప్రస్తావించారు. తన తండ్రి పరిపాలన కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో మార్పు రాలేదని. ముఖ్యంగా విద్య.. వైద్యం.. ఇతర వాటిల్లో వృద్ధి కనిపించలేదని కవిత క్లారిటీ ఇచ్చారు. విద్య.. వైద్యం వంటివి తమ ప్రథమ ప్రాధాన్యాలు అని కవిత క్లారిటీ ఇచ్చారు. అక్కడితోనే ఆగిపోలేదు.. ఇంకా చాలా విషయాలను కవిత ఈ సభలో చెప్పారు. తన తండ్రి పరిపాలన కాలంలో జరిగిన అవినీతిని.. అక్రమాలను.. తనను బయటికి పంపించిన విధానాన్ని ఆమె వివరించారు. ఇటీవల తన అత్తగారిల్లు అయిన నిజామాబాదులో పాంచ జన్య సభను నిర్వహించిన కవిత.. అక్కడ కన్నీళ్లు పెట్టుకున్నారు. సభలో మాట్లాడుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. కొడంగల్ లో మాత్రం ధైర్యంగా మాట్లాడారు. ప్రభుత్వం మీద ఆరోపణలు చేసిన ఆమె.. చివరికి తన తండ్రిని కూడా వదిలిపెట్టలేదు. అన్నిటికంటే ముఖ్యంగా గులాబీ పార్టీ సోషల్ మీడియాకు దిమ్మతిరిగిపోయేలాగా కవిత రిప్లై ఇచ్చింది. ఒక రకంగా దానిని స్లిప్పర్ షాట్ అని చెప్పవచ్చు. కొద్దిరోజులుగా గులాబీ పార్టీ సోషల్ మీడియా కవిత మీద వ్యక్తిగతంగా దాడి చేసే స్థాయిలో విమర్శలు చేస్తోంది. ఆ విమర్శలకు కవిత ఏర్పాటుచేసిన సోషల్ మీడియా గ్రూపులలో కౌంటర్ ఇస్తున్నప్పటికీ.. గులాబీ పార్టీ సోషల్ మీడియా ఆగడం లేదు. అందువల్లే కొడంగల్ సభ నుంచి కవిత గట్టిగా రిప్లై ఇచ్చారు. మరి దీనికి గులాబీ పార్టీ సోషల్ మీడియా ఎలాంటి కౌంటర్ ఇస్తుందో చూడాలి.

# ఇండియా నుంచి భారత్

హైదరాబాద్ : దేశ రాజకీయాల్లో కొన్ని నాయకత్వాలు ఎన్నికల విజయాలతో గుర్తుండిపోతాయి. మరికొన్ని నాయకత్వాలు పాలనా విధానాల్లో, ప్రజల ఆలోచనా ధోరణిలో తీసుకొచ్చిన మార్పులతో చరిత్రలో నిలిచిపోతాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే.. రెండో కోణం కూడా స్పష్టంగా కనిపిస్తుంది.ప్రధాని పదవి అంటే కేవలం ప్రభుత్వాన్ని నడపడం మాత్రమే కాదనే భావనను మోదీ తన పనితీరుతో ముందుకు తెచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాలు, దేశ పర్యటనలు, సమీక్షలు, అంతర్జాతీయ సమావేశాలు, ప్రజా కార్యక్రమాలు.. ఇలా నిరంతర కార్యకలాపాలతో ఆయన రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. వ్యక్తిగత ఆరోగ్యంపై పెద్దగా చర్చకు తావివ్వకుండా విధులకు ప్రాధాన్యం ఇవ్వడం ఆయన నాయకత్వ శైలిలో కనిపించే అంశం.మోదీ పాలనలో మరో ముఖ్యమైన అంశం.. సంప్రదాయ రాజకీయాలను అభివృద్ధి, సంక్షేమం, సామాజిక మార్పుతో అనుసంధానం చేయడం. స్వచ్ఛ భారత్, యోగా, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ సాంకేతికత, పేదల కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలు వంటి అంశాలను ప్రభుత్వ కార్యక్రమాలుగా మాత్రమే కాకుండా ప్రజా ఉద్యమాలుగా మలిచేందుకు ప్రయత్నించారు. ప్రజల భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి సాధ్యమనే సందేశాన్ని పదేపదే ముందుకు తెచ్చారు.దేశ ప్రయోజనమే ముందన్న భావనను ప్రజల్లో బలపరచడం కూడా మోదీ రాజకీయ శైలిలోని ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. వ్యక్తి కంటే దేశం, రాజకీయాల కంటే జాతీయ ప్రయోజనం, హక్కులతో పాటు బాధ్యతలు అనే అంశాలను ఆయన ప్రసంగాల్లోనూ, కార్యక్రమాల్లోనూ ప్రస్తావిస్తూ వచ్చారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో కనిపించిన దేశభక్తి, జాతీయ పునర్నిర్మాణ స్ఫూర్తిని కొత్త తరానికి పరిచయం చేసే ప్రయత్నం కూడా ఇందులో భాగమే.'ఇండియా' నుంచి 'భారత్' వైపు సాగుతున్న చర్చ కూడా ఈ మారుతున్న ఆలోచనా ధోరణికి ఒక ప్రతీకగా మారింది. ఇది కేవలం పేరుకు సంబంధించిన మార్పు కాదు.. దేశపు సాంస్కృతిక మూలాలు, చారిత్రక వారసత్వం, భారతీయ జీవన విధానంపై పెరుగుతున్న దృష్టికి ప్రతిబింబంగా చూడవచ్చు. ఈ పరివర్తనలో మోదీ నాయకత్వం ఒక ముఖ్యమైన పాత్ర పోషించిందనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

## ఆత్మకూరులో మంత్రుల పర్యటన

నెల్లూరు: నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణంలో 53.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, కొలుసు పార్థసారథి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్, శాసన మండలి సభ్యుడు బీద రవిచంద్ర,కావలి ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా, పలువురు అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా 45 కోట్లతో చేపట్టిన పనులతోపాటు, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పైలాన్ ను ఆవిష్కరించారు. అంతకుముందు ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో స్థానిక నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రుల రాకతో ఆత్మకూరులో సందడి వాతావరణం నెలకొంది.

## జనసేన కార్యకర్త మృతి పట్ల నాగబాబు సంతాపం

కోనసీమ: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బెండమూర్లంకకు చెందిన జనసైనికుడు రోళ్ల ప్రేమ్ కుమార్ మృతిపట్ల జనసేన నేత నాగబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పవన్ జన్మదిన వేడుకలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ప్రేమ్ కుమార్ మృతి చెందడం విషాదకరమని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులను వీడియో కాల్ ద్వారా పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబికులకు నిర్మాత ఎస్‌కేఎన్ రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించారు.

## ఏసీబీ వలలో అసెస్ మెంట్ అధికారి

మంచిర్యాల : భీమిని మండలం, పెద్దాపేట గ్రామ పరిపాలన అధికారి (జి.పి.ఓ.) దుర్గా ప్రసాద్, ఫిర్యాదిదారుడి నుండి డిమాండ్ చేసిన రూ. 1,30,000/- లంచంలో మొదటి విడత అయిన రూ. 80,000/-ను తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు. పెద్దాపేట శివార్లలోని వ్యవసాయ క్షేత్రాల సమీపంలో ఏసీబీ ఆదిలాబాద్ రేంజ్ యూనిట్కు రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డాడు. ఫిర్యాదిదారుని పేరు మీద భూమి బదిలీ, పట్టా పాస్బుక్లను జారీ చేయడం రూ. 1,30,000/-లంచం డిమాండ్ చేశాడుజ. అందులో భాగంగా, మొదటి విడతగా రూ. 80,000/- మరియు పని పూర్తయిన తర్వాత మిగిలిన రూ. 50,000/- చెల్లించాలని ఆదేశించాడు. బాధితులు లంచం నగదు ఇవ్వడానికి వచ్చినప్పుడు మరో వ్యక్తి పోతు రాజేందర్తో కలిసి మోటార్సైకిల్పై పెద్దాపేట చేరుకుని, ఫిర్యాదిదారుడిని రూ. 80,000/- తీసుకున్నాడు. అక్కడే మాటు వేసిన ఏసీబీ బృందం దుర్గాప్రసాద్ ను పట్టుకుంది. ఇద్దరిని అరెస్టు చేసి ఏసీబీ కోర్టుకు తరలించారు.

## రామాయంపేట నియోజకవర్గాన్ని తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్

రామాయంపేట : మెదక్ జిల్లా రామాయంపేట గతంలో అభివృద్ధిలో దూసుకుపోతున్న నియోజకవర్గం గత డెలిమిటేషన్‌లో రద్దు కావడం వల్ల ప్రాంతానికి తీరని నష్టం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం మెదక్ జిల్లా గౌరవాధ్యక్షులు మెట్టు గంగారం అన్నారు.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం డెలిమిటేషన్ ప్రక్రియను చేపట్టనున్న నేపథ్యంలో రద్దయిన రామాయంపేట నియోజకవర్గాన్ని తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.రామాయంపేటను నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేసి రామాయంపేట శంకరంపేట,నిజాంపేట,నార్సింగి, చేగుంట మండలాలను కలిపి నూతన రామాయంపేట నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.ఈ డిమాండ్ ప్రజల అభివృద్ధి ఆకాంక్షలకు అనుగుణమైనదేనని ఇది గొంతెమ్మ కోరిక కాదని స్పష్టం చేశారు.1952 నుంచి 2009 వరకు రామాయంపేట నియోజకవర్గంగా కొనసాగిందని అనంతరం డెలిమిటేషన్‌లో నియోజకవర్గాన్ని రద్దు చేయడంతో రామాయంపేట ప్రాంతం రాజకీయంగా పరిపాలనాపరంగా నష్టపోయిందని పేర్కొన్నారు.రామాయంపేటను తిరిగి అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దాలంటే నియోజకవర్గాన్ని పునరుద్ధరించడం అవసరమన్నారు.రామాయంపేట నియోజకవర్గ పునరుద్ధరణ కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎంతటి త్యాగానికైనా తాము సిద్ధంగా ఉంటామని,ప్రజల హక్కు కోసం పోరాటం చేస్తూ వెనుకడుగు వేసేది లేదని తెలిపారు.

## మాదాపూర్లో యువతి అనుమానాస్పద మృతి

హైదరాబాద్ : మాదాపూర్ ఓయో హోటల్లో యువతి అనుమానాస్పద మృతి చెందింది. మృతురాలు విశాఖపట్నానికి చెందిన షారన్ నిఖిత టోప్నో (23). ప్రియుడు శ్రీనివాస రవితేజతో కలిసి హైదరాబాద్కు వచ్చి మాదాపూర్ సిద్ధిఖీ నగర్ రోడ్డు నంబర్-5లోని ఓయో హోటల్ రూమ్ నం.303లో నిన్న దిగింది. యువతిని ఆమె ప్రియుడు శ్రీనివాస రవితేజ, హోటల్ సిబ్బంది కలిసి అత్యవసర చికిత్స నిమిత్తం కొండాపూర్ లోని ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆమెను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆసుపత్రి సిబ్బంది మాదాపూర్ పోలీసులకు ఫోన్ చేసి చెప్పారు. పోలీసులు వెంటనే ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి.. మృతురాలి ముఖం, తలపై తీవ్రమైన గాయాలు, వాపులు ఉన్నట్లు గుర్తించారు. యువతి మృతి చెందినట్లు తెలియగానే ప్రియుడు ఆసుపత్రి సిబ్బందికి కంటపడకుండా అక్కడి నుంచి పరారైయాడు. హోటల్ గదిని పరిశీలించి, అక్కడి గోడలు, బెడ్ షీట్ పై రక్తపు మరకలను గుర్తించి.. నిందితుడు శ్రీనివాస రవితేజ కోసం గాలిస్తున్నారు.

## బంగారు నల్ల పూసల గొలుసు చోరీ

### - ఇద్దరు బెడ్ రోల్ అటెండర్స్ అరెస్ట్

సికింద్రాబాద్ : వజ్రపు లాకెట్ తో ఉన్న బంగారు నల్ల పూసల గొలుసు చోరీకి పాల్పడిన ఇద్దరు బెడ్ రోల్ అటెండర్స్ ను రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి వారి నుండి లక్షా యాభై వేల విలువైన నగను యదాతదంగా స్వాదీనం చేసుకొని రిమాండ్ కు తరలించారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ ఎస్ ఎన్ జావేద్ మాట్లాడుతూ ధారు ఢ సన్స్ బెడ్ రోలర్ సరఫరాదారుల ఆధ్వర్యంలో బీహార్ చెందిన రాహుల్ కుమార్, సురేష్ పాశ్వాన్ దురంతో ఎక్స్ ప్రెస్ రైల్ లో బెడ్ రోలర్ అటెండెర్లుగా పని చేస్తున్నారు. ఇద్దరు కలసి మద్యం సేవించడం, సిగరెట్లు త్రాగడం వంటి దురలవాట్లకు అలవాటు పడ్డారు. తమ ఉద్యోగం ద్వారా వస్తున్న డబ్బులు సరిపోకపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించడం కోసం ప్రయాణికుల విలువైన వస్తువులు దొంగిలించాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అందులో భాగంగా ఈ నెల 16న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కు చేరుకున్న దురంతో ఎక్స్ ప్రెస్ రైల్ లో దుప్పట్లు సేకరిస్తున్న రాహుల్ కు అందులో వజ్రపు లాకెట్ ఉన్న బంగారు పూసల గొలుసు లభించింది.దానిని సురేష్ తో కలసి అమ్మి వచ్చిన డబ్బులను అవసరాలు తీర్చు కోవడానికి సిద్దామయ్యారు.

## డ్రగ్స్ ముఠా అరెస్ట్

సికింద్రాబాద్: ఈజీ మనీకి అలవాటు పడి డ్రగ్స్ అమ్ముతున్న రాజస్థాన్ కు చెందిన ముఠాను మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు.. విక్రయిస్తున్న వ్యక్తి మహావీర్ సింగ్ తో పాటు వినియోగదారుడు లక్ష్మబ్ సింగ్ ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు..రాజస్థాన్ నుండి సరఫరా చేస్తున్న కుల్దీప్ పరారీ లో ఉన్నారని పోలీసులు తెలిపారు... నిందితుల వద్ద 23 గ్రాముల ఓఆఓం డ్రగ్స్ తో పాటు మొబైల్ ఫోన్స్, క్యాష్ స్వాధీనం చేసుకున్నారు... డ్రగ్స్ అమ్మినా, వినియోగించిన చట్టపరమైన చర్యలు ఉంటాయని మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ హెచ్చరించారు... డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని డీసీపీ సూచించారు..

## అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం

రామాయంపేట : మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ గోల్పర్తి అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిడిపిఓ స్వరూప రాణి మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు.మన పరిసరాల్లో సులభంగా లభించే తక్కువ ధరలో దొరికే వివిధ రకాల కూరగాయలు ఆకుకూరలను నిత్య ఆహారంలో భాగంగా చేసుకోవాలని పేర్కొన్నారు.వీటిలో ఉండే పోషక విలువలు వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను అలాగే అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే బాలామృతంలోని పోషక పదార్థాలు వాటి ప్రాధాన్యత గురించి తెలిపారు. గర్భిణీలు బాలింతలు పోషకాహారంపై అవగాహన పెంచుకొని తమ ఆరోగ్యంతో పాటు శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సృజన అంగన్వాడీ టీచర్లు మార్త మరియు పద్మతో పాటు తల్లులు గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు.

# సూర్య డైరెక్టర్స్.. ఇలా ప్లాన్ చేసుకుంటేనే..



ఒకప్పుడు స్టార్ హీరో సినిమా అంటే హీరో చుట్టూనే స్టోరీ తిరిగేది. ఇప్పుడు పరిస్థితి మారింది. హీరో ఎంత పెద్ద స్టార్ అయినా.. స్టోరీలో కొత్తదనం లేకపోతే ప్రేక్షకులు యాక్సెప్ట్ చేయడం కష్టంగా మారింది. ముఖ్యంగా సూర్య విషయంలో ఆ ఛేంజ్ మరింత క్లియర్ గా కనిపిస్తోంది. ఒక స్టేజ్ లో యూత్, ఫ్యామిలీ కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు రోల్ లో కొత్తదనం ఉంటేనే సినిమా చేయాలనే రేంజ్ కు వచ్చారు. ఇది కేవలం సూర్యలో వచ్చిన ఛేంజ్ కాదు. ఆయన సినిమాలను చూసే ప్రేక్షకుల్లో కూడా మార్పు వచ్చింది. ఒకప్పుడు హీరోను సిల్వర్ స్క్రీన్ పై చూస్తే సరిపోయేది. ఇప్పుడు హీరో రోల్ కు ఏమైనా స్పెషాలిటీ ఉందా, కథలో కొత్త పాయింట్ ఏంటనే విషయాలను ప్రేక్షకులు అబ్జర్వ్ చేస్తున్నారు. అందుకే సూర్యతో సినిమా చేసే దర్శకులకు ఇప్పుడు మరింత కష్టంగా మారింది. సూర్యకు సరిపోయే స్టోరీ రాయడం ఒక ఎత్తయితే.. ఆయనలో ఇప్పటివరకు చూడని యాంగిల్ ను బయటకు తీయడం మరో ఎత్తు. ఇదే ఇప్పుడు దర్శకుల ముందున్న అసలు టాస్క్. భారీ యాక్షన్ సీన్లు, పెద్ద సెట్లు, స్టార్ క్యాస్ట్ మాత్రమే సరిపోవు. వాటి వెనుక స్ట్రాంగ్ రోల్ ఉండాలి. ఆ రోల్ కు ఆడియన్స్ కనెక్ట్ అయ్యే కారణం ఉండాలి. సూర్య గత సినిమాల నుంచి కూడా ఒక విషయం అర్థమవుతుంది. ప్రయోగం చేయడానికి ఆయన వెనకడుగు వేయడం లేదు. అదే సమయంలో తన స్టార్ ఇమేజ్ కు సరిపోయే కమర్షియల్ ఎలిమెంట్స్ వదులుకోవడం లేదు. అందుకే సూర్యతో పనిచేసే దర్శకులు ముందుగా ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. ప్రేక్షకులకు ఇప్పటికే తెలిసిన సూర్యను మరోసారి చూపించకుండా.. కొత్త రోల్ లో ఉన్న సూర్యను చూపించాలి. హీరో ఎంట్రీకి వచ్చే హైప్ కంటే ఆ రోల్ కథలోకి ఎలా వస్తుంది, దాని జర్నీ ఎలా ఉంటుందనేదే ముఖ్యంగా మారింది. మరో ఇంట్రెస్టింగ్ విషయం ఆయన ఏజ్, ఎక్స్పీరియన్స్. కెరీర్ స్టార్టింగ్ లో చేసిన రోల్స్ ను ఇప్పుడు అదే విధంగా చేయడం పాజిబుల్ కాదు. ఇప్పుడు ఆయనలో ఉన్న ఎక్స్పీరియన్స్ ను రోల్స్ కు యూజ్ చేసుకునే ఛాన్స్ ఉంది. మెచ్యూర్డ్ పర్సన్ గా కనిపించే పాత్రలు, ఎమోషన్స్ కు ఎక్కువ స్థానం ఉన్న కథలు, వయసుకు తగ్గ కొత్త తరహా పాత్రలు సూర్యను మరో యాంగిల్ లో చూపించగలవు. అలాగే ఒకే దర్శకుడి ఫార్ములా మరో సినిమాకు పనిచేస్తుందని భావించడం కూడా ఇప్పుడు సరిపోదు. ప్రతి సినిమాకు స్పెషల్ వరల్డ్ ను క్రియేట్ చేయాల్సిన అవసరం ఉంది. సూర్య ఇమేజ్ ను యూజ్ చేసుకుంటూనే స్టోరీకి అవసరమైన చోట ఆయన స్టార్ పవర్ ను పెట్టాలి. అప్పుడే సినిమా హీరో మూవీ అనే రేంజ్ దాటి మంచి కథగా నిలిచే అవకాశం ఉంటుంది. అందుకే అప్పటి సూర్యను దృష్టిలో పెట్టుకుని కథ రాస్తే ఇప్పుడు సరిపోదు. ఇప్పటి సూర్యను అర్థం చేసుకుని కథ రాయాలి. అప్పుడే సక్సెస్ అందుకోవడానికి ఎక్కువ ఛాన్సులు ఉంటాయి.

# డేడ్లీ డాక్టర్ గా రజనీకాంత్ విధ్వంసం!




సూపర్ స్టార్ రజనీకాంత్ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో కోట్లాది మంది అభిమానులను అలరించారు. అయితే ఎన్నడు లేని విధంగా సూపర్ స్టార్ తొలిసారి డెడ్లీ డాక్టర్ పాత్రలో అలరించబోతున్నారు. ఓ మై కడవులే, డ్రాగన్ చిత్రాలతో ఆకట్టుకున్న యువ దర్శకుడు అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ధర్మన్. ఇందులో రజనీకాంత్ మాస్ ఇమేజ్‌కి సరికొత్త డార్క్, ఎడ్జీ షేడ్‌ను జోడిస్తూ రూపొందిస్తున్నారు. సినిమాలో రజనీకాంత్ పాత్ర తీరుతెన్నులు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సర్జికల్ స్కాల్పెల్ తో ఆపరేషన్ థియేటర్‌లోనే విలన్లపై విరుచుకుపడే వైలెంట్ డాక్టర్‌గా రజనీకాంత్ కనిపించడం సినిమా స్కేల్‌ను తెలియ జేస్తోంది. వైద్యం చేసే సాధు స్వభావిగానే కాకుండా నేరస్థుల పాలిట కాలయముడిగా మారే సీనియర్ మెడికల్ ప్రొఫెసర్ పాత్రలో రజనీ తనదైన మార్క్ స్వాగ్, మ్యానరిజమ్స్‌తో విధ్వంసం సృష్టించబోతున్నారని తెలుస్తోంది. అశ్వత్ మారిముత్తు మేకింగ్ విధానం ప్రాజెక్ట్‌కి ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. సూపర్ స్టార్ ఇమేజ్‌ను ఏమాత్రం తగ్గించకుండా నేటితరం ప్రేక్షకులకు నచ్చేలా విజువల్స్, యాక్షన్ సీక్వెన్సులను ప్లాన్ చేశారు. ప్రముఖ స్టంట్ మాస్టర్లు అన్బరివ్ కంపోజ్ చేస్తున్న హై–వోల్టేజ్ యాక్షన్ సీన్లు చిత్రంలో హైలైట్‌గా నిలవ నున్నాయి. అశ్వత్ విజన్ ,రజనీకాంత్ మాస్ అప్పీల్ కలిసి బాక్సాఫీస్ వద్ద సరికొత్త మేజిక్ చేస్తారంటూ ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే రెండు సుదీర్ఘ షెడ్యూళ్లను పూర్తి చేసుకున్న చిత్ర యూనిట్ ఇటీవల మూడో షెడ్యూల్‌ను ప్రారంభించింది. సెట్స్ నుంచి వచ్చిన బిహైండ్ ది సీన్స్ వీడియోలలో రజనీకాంత్ జూనియర్ డాక్టర్లకు లెక్చర్ ఇస్తున్న సన్నివేశాలు, రాశీ ఖన్నాతో కలిసి ఉన్న పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. –కెట్ట పయ్యాన్ సర్– అనే క్యాప్షన్‌తో రిలీజ్ చేసిన డెడ్లీ డాక్టర్ లుక్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా స్కైకి తీసుకెళ్తుంది. ఈ సినిమా షూటింగ్ అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఒకవైపు జైలర్ 2 వంటి భారీ ప్రాజెక్ట్ లైన్‌లో ఉండగానే.. మరోవైపు యువ దర్శకుడితో రజనీకాంత్ చేస్తోన్న –ధర్మన్– పై అంచనాలు రెట్టింపు అవ్వడం మరింత క్రేజీగా మారుతోంది. జైలర్ గనుక 1000 కోట్ల క్లబ్ లో చేరితో? ధర్మన్ పై అంచనాలు ఇంకా రెట్టింపు అవుతాయి.

# రా అండ్ రాస్టిక్ సినిమా చేస్తే సక్సెస్ వచ్చినట్టేనా?




ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోల హవా ఎక్కువగా కొనసాగుతుంది. వాళ్ళు చేసే సినిమాలతో ప్రేక్షకులను మెప్పించడమే కాకుండా ఇండియన్ సినిమా ఇండస్ట్రీని సైతం శాసించే స్థాయికి వెళ్ళిపోయారు. ఇక ఇలాంటి క్రమంలోనే ఎట్లాంటి సినిమాలు చేస్తే తమకు సక్సెస్ లు దక్కుతాయనే విషయంలో స్టార్ హీరోలు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తున్నారు. ఏది ఏమైనా కూడా తము చేయబోయే సినిమా ప్రేక్షకులను ఎంటర్టైన్ చేయాలని తద్వారా తమకంటూ ఒక ఐడెంటిటిని క్రియేట్ చేసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నారు. రామ్ చరణ్ – సుకుమార్ కాంబినేషన్ లో వచ్చిన 'రంగస్థలం' సినిమా రా అండ్ రస్టిక్ నేపథ్యంలో తెరకెక్కింది. రూరల్ బ్యాక్ డ్రాప్ లో వచ్చిన ఈ సినిమా యావత్ తెలుగు సినిమా ప్రేక్షకులందరిని మెప్పించింది. దాంతో తెలుగు సినిమా ఇండస్ట్రీలో చాలావరకు మార్పులు వచ్చాయి. ఇప్పుడున్న స్టార్ హీరోలందరు అలాంటి సినిమాల వైపే మొగ్గు చూపిస్తున్నారు. అల్లు అర్జున్ 'పుష్ప' సినిమాతో రా అండ్ రస్టిక్ బ్యాక్ డ్రాప్ ను ఎంచుకొని చిత్తూరు యాసలో మాట్లాడి ప్రేక్షకులందరిని ఎంటర్ టైన్ చేశాడు. నాని సైతం 'దసర' సినిమాతో అలాంటి బ్యాక్ డ్రాప్ లోనే వచ్చి సక్సెస్ ని తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక రీసెంట్ గా రామ్ చరణ్ – బుచ్చిబాబు కాంబినేషన్లో వచ్చిన 'పెద్ది' సినిమా కూడా అలాంటి నేపథ్యంలోనే రావడం విశేషం... ఇక అక్కినేని అఖిల్ సైతం లెనిన్ సినిమాతో సక్సెస్ సాధించాడు. ఈ మూవీ కూడా రా అండ్ రస్టిక్ బ్యాక్ డ్రాప్ లోనే వచ్చింది. అఖిల్ ఇండస్ట్రీ కి వచ్చి 10 సంవత్సరాలు దాటినా కూడా అతనికి సరైన సక్సెస్ లేదు. ఇక లెనిన్ తో ఆయన మొదటి సక్సెస్ ని అందుకోవడమే కాకుండా తన అభిమానుల్లో ఆనందాన్ని నింపాడు. చాలామంది స్టార్ హీరోలు సైతం అదే బాటను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. స్టార్ హీరోలందరు ఎందుకని అదే నేపథ్యంలో కథలను ఎంచుకొని సినిమాలు చేస్తున్నారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా కూడా సక్సెస్ అనేది చాలా ఇంపార్టెంట్ కాబట్టి ట్రెండ్ లో ఏ సినిమాలు ఉంటే అలాంటి బ్యాక్ డ్రాప్ లోనే సినిమాలను చేసి దాన్ని క్యాష్ చేసుకోవాలని ప్రతి ఒక్క హీరో కోరుకోవడంలో తప్పైతే లేదు. ఇప్పుడు రా అండ్ రస్టిక్ నేపథ్యంలో సినిమాలు నడుస్తున్నాయి. కాబట్టి ప్రతి ఒక్కరు అలాంటి సినిమాతోనే ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇక మరో 2 సంవత్సరాల పాటు ఇలాంటి సినిమాలే రాబోతున్నాయి. ఆ తర్వాత ఈ మూవీస్ ప్రేక్షకులకు బోర్ కొట్టించే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి ఈ లోపు కొంతమంది స్టార్ డైరెక్టర్లు మరింత డిఫరెంట్ సినిమాలను ప్రేక్షకులు ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేసుకుంటుండటం విశేషం...

# చరణ్ ప్లానింగ్ వెనుక పెద్ద గేమే



ఆర్ఆర్ఆర్ తర్వాత మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ నుంచి వచ్చే ప్రతి సినిమాపై అంచనాలు కూడా ఓ రేంజ్ లో ఉంటున్నాయని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. ఇటీవల పెద్ది సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన చరణ్.. ఆ మూవీతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు తన నెక్స్ట్ ప్రాజెక్ట్ పై ఫోకస్ పెట్టారు. పెద్దిలో చరణ్ ను ఇప్పటివరకు చూడని లుక్, రోల్ లో చూపించే ప్రయత్నం చేశారు బుచ్చిబాబు. స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ తో తెరకెక్కిన ఆ సినిమా ద్వారా ఆయన మరోసారి కొత్త తరహా పాత్రను ఎంచుకున్నారు. దీంతో చరణ్ స్టోరీల సెలక్షన్ పై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ఒక సినిమా తర్వాత మరో మూవీ పూర్తిగా భిన్నంగా ఉండేలా ఆయన ప్లాన్ చేస్తున్నారనే చర్చ కూడా మొదలైంది. ఇక ప్రస్తుతం చరణ్.. దర్శకుడు సుకుమార్ తో భారీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. ఆ సినిమాపై ఇప్పటికే అంచనాలు భారీగా ఉన్నాయి. రంగస్థలం వంటి బ్లాక్ బస్టర్ మూవీ అందించిన ఆ కాంబినేషన్ మరోసారి కలవడంతో నార్మల్ గానే ఇంట్రెస్ట్ పెరిగింది. త్వరలోనే ఆ సినిమా షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం చరణ్ ఫోకస్ మొత్తం ఆ ప్రాజక్టుపైనే ఉంది. అయితే అసలు ఇంట్రెస్ట్ మాత్రం ఆ సినిమా తర్వాతే మొదలవుతోంది. సుకుమార్ మూవీ తర్వాత చరణ్ ఎవరితో సినిమా చేయబోతున్నారనే విషయంపై ఇప్పటివరకు అఫీషియల్ క్లారిటీ లేదు. కొంతమంది దర్శకుల పేర్లు వినిపిస్తున్నా.. ఏ ప్రాజెక్ట్ ఫిక్స్ అయిందనే విషయంలో మాత్రం క్లారిటీ లేదు. ఇది చూస్తే చరణ్ లైనప్ లో ఎంప్టీ స్పేస్ ఉందని అనిపించొచ్చు. కానీ నిజానికి పరిస్థితి అలా ఉండకపోవచ్చు. ప్రస్తుతం చేస్తున్న సుకుమార్ తో ప్రాజెక్ట్ భారీ స్థాయిలో ఉండటంతో దానికి ఎక్కువ సమయం అవసరం కావచ్చు. స్టోరీ, క్యాస్టింగ్, షూటింగ్, ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ ఇలా సినిమా పూర్తయ్యే వరకు ఎక్కువ సమయం పడుతుంది. అందుకే తర్వాతి సినిమాను వెంటనే ప్రకటించకపోవడం మామూలు విషయమే. అదే సమయంలో చరణ్ రేంజ్ కూడా ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. ఆర్ఆర్ఆర్ తర్వాత తెలుగు ప్రేక్షకులతో పాటు ఇతర లాంగ్వేజ్ ఆడియన్స్ కూడా ఆయన సినిమాలను అబ్జర్వ్ చేస్తున్నారు. దీంతో తర్వాతి సినిమా విషయంలో స్టోరీ సెలక్షన్ ఇంపార్టెంగ్. కేవలం భారీ బడ్జెట్ లేదా మాస్ యాక్షన్ ఉంటే సరిపోదు. స్ట్రాంగ్ కంటెంట్ ఉండాల్సిన అవసరం ఉంది. అలా పెద్దితో స్పోర్ట్స్ జోనర్ ను టచ్ చేసిన చరణ్.. ఇప్పుడు సుకుమార్ తో మరో భిన్నమైన వరల్డ్ లోకి వెళ్లబోతున్నారు. ఇలాంటి సమయంలో వెంటనే మరో ప్రాజెక్టును అనౌన్స్ చేయకుండా కథ విషయంలో సమయం తీసుకుంటే అభిమానుల్లో అంచనాలు మరింత పెరగడం సహజం. ప్రస్తుతం చరణ్ లైనప్ చూస్తే ఎంప్టీ స్పేస్ కంటే ఒక ప్లాన్ ఉన్నట్లుగానే కనిపిస్తోంది. మరి ఫ్యూచర్ లో ఎవరెవరితో చరణ్ వర్క్ చేస్తారో వేచి చూడాలి.

# ఫస్ట్ లుక్ తో ఊపేసిన వర్మ.. వశిష్ట అంతకుమించి?



మోక్షజ్ఞ పేరు వినగానే ఇప్పుడు ఒక్క సినిమా కాదు.. నందమూరి ఫ్యాన్స్ ఎన్నో ఏళ్ల వెయిటింగ్ గుర్తొస్తుంది. అలాంటి హీరోను స్క్రీన్ పైకి ఎలా తీసుకురావాలనేది దర్శకుడికి పెద్ద ఛాలెంజ్. దాన్ని ముందుగా అందుకున్నది టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ. మోక్షజ్ఞ ఫస్ట్ లుక్ బయటకు వచ్చిన రోజు వచ్చిన రెస్పాన్స్ చూస్తే.. ఏ రేంజ్ లో అంచనాలు ఉన్నాయో అర్థమైంది. ఒక్క పోస్టర్ తోనే మోక్షజ్ఞపై ఉన్న ఇమేజ్ ను మార్చే ప్రయత్నం చేశారు వర్మ. ఆ లుక్‌లో మోక్షజ్ఞను చూసిన ఫ్యాన్స్ కు కొత్త ఫీలింగ్ వచ్చింది. ఇంతకాలం చూసిన మోక్షజ్ఞ వేరు.. పోస్టర్ లో కనిపించిన మోక్షజ్ఞ వేరు అన్నట్టుగా మేకోవర్ ఉండటంతో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ముఖ్యంగా నందమూరి వారసుడి ఎంట్రీ ఇలా ఉండబోతోందా అనే ఇంట్రెస్ట్ పెరిగింది. సినిమా సెట్స్ పైకి వెళ్లకముందే ఫస్ట్ లుక్ తో ఫుల్ హైప్ రావడం అప్పట్లో స్పెషల్ గా నిలిచింది. కానీ కథ అక్కడితో ఆగిపోయింది. కొన్ని కారణాలతో ప్రశాంత్ వర్మ కాంబినేషన్ ముందుకు వెళ్లలేదు. ఇప్పుడు మోక్షజ్ఞ డెబ్యూను దర్శకుడు వశిష్ఠ చేతుల్లో పెట్టారు. అయితే మోక్షజ్ఞ తొలి సినిమాతోనే తనకంటూ ఒక స్పెషల్ మార్క్ తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది కనుక రొటీన్ మాస్ కథ కాకుండా భారీ ఫాంటసీ వరల్డ్ ను వశిష్ట ఎంచుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో హీరోను ఎలివేట్ చేయడానికి ఫైట్లు, డైలాగులు, మాస్ సీన్లు ఉంటే సరిపోయేది. కానీ ఇప్పుడు మోక్షజ్ఞ విషయంలో కొత్త వరల్డ్ క్రియేట్ చేసే ప్రయత్నం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇదే వశిష్ఠకు అసలు ప్లస్ పాయింట్ కావచ్చు. బింబిసారతో ఫాంటసీ కథను డీల్ చేసిన ఎక్స్పీరియన్స్ ఉంది. అదే జోన్‌ను మరింత బిగ్ రేంజ్ లో తీసుకెళ్లే అవకాశం ఆ సినిమాతో దక్కుతోంది. మోక్షజ్ఞకు కూడా ఇది ప్లస్ కావచ్చు. ఎందుకంటే మొదటి సినిమాతోనే తనను ఒక నార్మల్ కమర్షియల్ హీరోగా కాకుండా స్పెషల్ వరల్డ్ కు చెందిన హీరోగా పరిచయం చేసే అవకాశం ఉంటుంది. ఇక సినిమాలో బాలకృష్ణ పాత్ర కూడా కీలకంగా ఉండబోతుందనే ప్రచారం అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. తండ్రి స్టార్ డమ్ ను యూజ్ చేసుకోవడం మాత్రమే కాకుండా.. మోక్షజ్ఞ రోల్ కు స్ట్రాంగ్ సపోర్ట్ అందించేలా బాలయ్య ఉంటుందని టాక్. అయితే ప్రశాంత్ వర్మ ఇప్పటికే మోక్షజ్ఞను ఎలా చూపించబోతున్నారో ఫస్ట్ లుక్ తో ఒక స్టాండర్డ్ సెట్ చేశారు. ఇప్పుడు వశిష్ఠ నుంచి వచ్చే లుక్ ఆ అంచనాలను దాటాలి. కేవలం మోక్షజ్ఞను స్టైలిష్ గా చూపిస్తే సరిపోదు. పోస్టర్ చూసిన వెంటనే ఆ హీరో కోసం ఇలాంటి కథే కావాలని అనిపించేలా ఉండాలి. అందుకే ఇప్పుడు మోక్షజ్ఞ సినిమా ఫస్ట్ లుక్ పై అంచనాలు మామూలుగా లేవు. వర్మ ఒక్క పోస్టర్ తో హైప్ పెంచితే.. వశిష్ఠ ఆ హైప్ ను ఏ రేంజ్ కు తీసుకెళ్తారనేది ఇంకొంత కాలం వేచి చూడాల్సిందే.

# బెబో త్రోబ్యాక్ లుక్‌పై ఫ్యాన్స్ డిబేట్

ప్రముఖ బాలీవుడ్ నటి కరీనా కపూర్ ఖాన్ దేవతా సుందరి రూపాన్ని ఆరాధించని అభిమానులు లేరు. బెబో కరీనా ప్రతి పుట్టినరోజును డెడికేటెడ్ గా జరుపుకునే ఫ్యాన్స్ ఉన్నారు. ఈ ఏడాది మరో కొత్త జన్మదినం సందర్భంగా కరీనాను అభినందిస్తూ హార్పర్ బజార్– ఒక ప్రత్యేక పోస్ట్‌ను షేర్ చేయగా ఫ్యాన్స్ ఈ పోస్ట్ ని ఇందులోని ఫోటోషూట్ ని వైరల్ గా షేర్ చేస్తున్నారు. జబ్ వి మెట్ చిత్రంలోని గీత్, కభీ ఖుషీ కభీ ఘమ్ చిత్రంలోని పూ వంటి యువతరం హృదయాలను దోచిన పాత్రల నుండి.. ఇటీవలి క్రూ, దాయరా సినిమాల వరకు బెబో తన అద్భుతమైన నటనతో దశాబ్దాలుగా మోడరన్ బాలీవుడ్ ఐకాన్‌గా నిలిచిందనడంలో ఎలాంటి సందేహాలు లేవు. కరీనా పుట్టినరోజు సందర్భంగా ఒక పాత కవర్ పేజీకి సంబంధించిన ఫోటోలను గుర్తుచేసుకుంటూ కరీనా గ్లామర్–చరిష్మాను కొనియాడుతూ ఫ్యాన్స్ పోస్టులు పెడుతున్నారు. సోషల్ మీడియాలో ఈ పోస్ట్‌కు అభిమానుల నుంచి విభిన్న స్పందనలు వచ్చాయి. చాలామంది నెటిజన్లు కరీనా కపూర్ గ్లామర్‌ను ప్రశంసిస్తూ హార్ట్– ఫైర్ ఎమోజీలతో తమ ప్రేమను చాటుకున్నారు. బోబో ఉఫ్, దివా అంటూ ఆమె స్టైల్‌ను కొనియాడారు. అయితే మరికొందరు నెటిజన్లు మాత్రం ఈ లుక్‌పై భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మొదటి ఫోటో సరిగ్గా లేదని.. ఆ లుక్ కొంచెం భయంగా లేదా గందరగోళంగా ఉందని కామెంట్లు పెట్టారు. మొత్తానికి కరీనా పుట్టినరోజు సందర్భంగా హార్పర్స్ బజార్ ఇండియా పోస్ట్ చేసిన ఈ జ్ఞాపకం నెట్టింట బాగా చర్చనీయాంశంగా మారింది. బాలీవుడ్ బ్యూటీ కరీనా కపూర్ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా జోనాస్ కూడా ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా కరీనా ఫోటోను షేర్ చేస్తూ, పుట్టినరోజు శుభాకాంక్షలు కరీనా... మీలాంటి వారు ఇంకొకరు ఎప్పటికీ ఉండరు అంటూ ప్రశంసలు కురిపించారు. ఈ పోస్ట్‌లో కరీనా ధరించిన కలర్‌ఫుల్ రెయిన్‌బో టోన్డ్ లెహరియా చీర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇది తను నటించిన దాయరా సినిమా ప్రమోషన్స్‌కు సంబంధించినదిగా కనిపిస్తోంది. అంతేకాకుండా ఈ లుక్ 2001లో వచ్చిన జుబైదా చిత్రంలో కరీనా సోదరి కరిష్మా కపూర్ ధరించిన ఐకానిక్ లెహరియా చీరను (ధీమే ధీమే గావో పాటలో) గుర్తుకు తెచ్చేలా ఉండటం విశేషం. ఒకానొక కాలంలో కరీనా ప్రియాంకలను బాలీవుడ్ ప్రత్యర్థులుగా భావించేవారు. కాఫీ విత్ కరణ్ షోలో కరీనా, ప్రియాంక యాసపై సెటైర్ వేయగా... ప్రియాంక కూడా అంతే ధీటుగా సమాధానం ఇచ్చారు. అయితే కాలక్రమేణా వీరిద్దరి మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవని... అంతా సవ్యంగానే ఉందని స్పష్టం చేశారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. 2004లో అబ్బాస్–మస్తాన్ దర్శకత్వంలో వచ్చిన సంచలన థ్రిల్లర్ –ఐత్‌రాజ్– చిత్రంలో అక్షయ్ కుమార్ సరసన ఈ ఇద్దరు భామలు కలిసి నటించి ప్రేక్షకులను అలరించారు.



PUBLISHED, OWNED, EDITED BY SREERAMOJU BALANARASIMHA CHARY(PRGI : TGTEL/26/A0688), 4-12-798, DWARAKA MAI NAGAR, VANASTHALIPURAM, RANGA REDDY DIST, HYDERABAD - TELANGANA STATE -500070. 9440189819.
PRINTED AT SMILYS ONLINE #6-7-48, VANASTHALIPURAM SHOPPING COMPLEX, HYDERABAD, RANGAREDDY-TELANGANA-500070, PH:- 9440189819, specialeditiondaily@gmail.com